

నేడు షాద్‌నగర్‌కు సీఎం రాక



షాద్‌నగర్ అర్బన్, మే 9: రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం సాయంత్రం షాద్‌నగర్‌కు వస్తున్నారని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. సాయంత్రం 5.30 గంటలకు రోడ్ షోను నిర్వహిస్తారని తెలిపారు. అనంతరం చౌరస్తాలో కార్నర్ మీటింగ్‌లో మాట్లాడతారని అన్నారు. ఇందుకు కోసం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలి రావాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు.

రేపు జిల్లాకు అగ్రనేతల రాక

- అమిత్ షా, ప్రియాంకా గాంధీ సభలకు ఏర్పాట్లు
- వికారాబాద్, తాండూరులో సిద్ధమైన హెలీప్యాడ్లు
- కొనసాగుతున్న సభల ఏర్పాట్లు
- జన సమీకరణలో కాంగ్రెస్, బీజేపీ పార్టీలు



తాండూరులో ప్రియాంక సభ కోసం ఏర్పాటు చేసిన వేదిక

వికారాబాద్, మే 9 (ఆంధ్రజ్యోతి) : లోక్‌సభ ఎన్నికల ప్రచారం నిర్వహించేందుకు ఈనెల 11న వికారాబాద్ జిల్లాకు వస్తున్న కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ బహిరంగ సభల కోసం ఏర్పాట్లు చురుకుగా కొనసాగుతున్నాయి. వికారాబాద్ జిల్లా కేంద్రంలో ఎస్‌ఏపీ కళాశాల గ్రౌండ్స్‌లో అమిత్ షా బహిరంగ సభ ఏర్పాట్లు కొనసాగుతుండగా, సభా ప్రాంగణం సమీపంలోనే హెలీప్యాడ్ సిద్ధం చేశారు. గురువారం సాయంత్రం జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, ఏఎస్పీ రవీందర్ రెడ్డి, డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, ఏఆర్‌డీఎస్పీ వీరేశంలు పరిశీలించారు. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై బీజేపీ నాయకులతో చర్చించారు. తాండూరులో విలియమ్ మూన్ హైస్కూల్ గ్రౌండ్స్‌లో ప్రియాంకా గాంధీ బహిరంగ సభ ఏర్పాట్లు కొనసాగుతుండగా, పీపుల్స్ డిగ్రీ కళాశాల ఆవరణలో హెలీప్యాడ్ ఏర్పాటు చేశారు. అమిత్‌షా సభా వేదిక ఏర్పాట్లను గురువారం భూమి పూజ చేసి ప్రారంభించారు. కాగా, తాండూరులో బహిరంగ సభ ఏర్పాట్లు చివరి దశలో ఉన్నాయి. శనివారం ఉదయం 11 గంటలకు వికారాబాద్‌లో అమిత్‌షా బహిరంగ సభ జరగనుండగా, అదే రోజు మధ్యాహ్నం 1.15 గంటలకు తాండూరుకు ప్రియాంకా గాంధీ రానున్నారు. ఒకేరోజు బీజేపీ, కాంగ్రెస్ పార్టీల అగ్రనేతలు ఎన్నికల ప్రచార సభలకు హాజరవుతుండడంతో ఒక్కసారిగా జిల్లాలో రాజకీయ వేడి పెరిగింది. పోటాపోటీగా జన సమీకరణ చేసేందుకు కాంగ్రెస్, బీజేపీలు సిద్ధమవుతున్నాయి. ఎక్కువ సంఖ్యలో జన సమీకరణ చేసి సత్తా చాటుకునేందుకు ఆయా పార్టీల నేతలు పోటాపోటీగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. అమిత్ షా, ప్రియాంకా గాంధీ జిల్లాకు వచ్చే రోజు సాయంత్రమే ఎన్నికల ప్రచారం ముగియనుండడంతో వారి ప్రభావం జిల్లా ప్రజలపై ఉండే అవకాశం ఉన్న నేపథ్యంలో భారీ సంఖ్యలో జన సమీకరణకు సిద్ధమవుతున్నారు.



వికారాబాద్‌లో సిద్ధమవుతున్న హెలీప్యాడ్

మరింత లోతుకు!

- గతంలో కంటే 3.88 మీటర్ల లోతుల్లోకి నీరు
- 12 మండలాల్లో ప్రమాద ఘంటికలు
- విచ్చలవిడిగా బోర్ల వినియోగం.. పట్టించుకోని అధికారులు
- ఎండిన చెరువులు, కుంటలు, వట్టిపోతున్న బోరుబావులు





జిల్లాలో గణనీయంగా తగ్గిపోతున్న నీటిమట్టం

ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్, మే 9 : జిల్లాలో భూగర్భ జలాలు గణనీయంగా తగ్గిపోతున్నాయి. వాతావరణ మార్పులు, ఎండ వేడి తీవ్రత కారణంగా భూగర్భ జలమట్టం పడిపోతోంది. ఇష్టారాజ్యంగా బోరుబావుల తవ్వకాలు, విచ్చలవిడిగా నీటి వినియోగంతో భూగర్భజలాల నీటిమట్టం తగ్గుముఖం పడుతోంది. గత ఏడాది ఏప్రిల్, ఈసారి ఏప్రిల్‌లో కురవాల్సిన వర్షపాతం కంటే మైనస్‌లో పడేలా వర్షాలు కురవడం ఆందోళన కలిగిస్తోంది. భూగర్భజల శాఖ అధికారులు గ్రామాల్లో పర్యటిస్తూ బోరుబావుల వినియోగాన్ని తగ్గించుకోవాలని కోరుతున్నారు. అయినప్పటికీ ఆరుతడి పంటలకు చివరి దశలో సాగునీరు అందించాల్సిన అవసరం ఉన్న కారణంగా బోరు బావులను ఎక్కువగా వినియోగిస్తున్నారు. దీంతో భూ గర్భజలం క్రమంగా అడుగంటిపోతోంది. జిల్లాలోని ప్యూజోమీటర్ ఆధారంగా జిల్లా వ్యాప్తంగా బోరు బావులను లెక్కిస్తుంటారు. ప్రస్తుతం బావుల్లో సగటు నీటి మట్టం మైనస్ 3.88 మీటర్ల లోతులోకి వెళ్లింది. గత సంవత్సరం ఇదే నెలలో సగటు నీటిమట్టం 10.20 మీటర్లు అందుబాటులో ఉండగా ఈసారి 14.08 మీటర్లకు చేరింది. జిల్లా సగటు నీటిమట్టం మైనస్ 3.88కు తగ్గిపోవడం వాతావరణ తీవ్రతకు అద్దం పడుతోందంటున్నారు పర్యావరణవేత్తలు. ఉష్ణోగ్రతలు తీవ్రంగా ఉండడం, పోటాపోటీగా నీటి వినియోగం కారణంగా నీరంతా అడుగంటే పరిస్థితికి చేరుకుందంటున్నారు. అనుమతులు లేకుండా బోరు బావుల తవ్వకాలు జరపవద్దని, బోరుబావులను తక్కువగా వినియోగించాలని అధికారులు సూచిస్తున్నారు.

ఎండలు మండుతున్నాయి. ఎండలకు భూగర్భ జలాలు కూడా అడుగంటుతున్నాయి. తాగు, సాగునీటికి కటకట ఏర్పడింది. జనాలు గొంతు తడుపుకునేందుకు నీరు లేక అలమటిస్తుంటే.. పంటలు నిలువునా ఎండుతున్నాయి. బోర్లు, బావులు ఎండిపోవడంతో పంట పొలాలు నెర్రెలు బారాయి. నీటికోసం అధికంగా బోర్లు తవ్వడం, కొన్నిచోట్ల అనవసరంగా నీటిని వృథా చేయడం లాంటి కారణాలు కూడా భూగర్భ జలాలు అడుగంటడానికి కారణమవుతున్నాయి. జిల్లాలో ప్రధానంగా 12 మండలాల్లో పరిస్థితి ఇప్పటికే మరింత తీవ్రంగా మారింది. రానున్న రోజుల్లో నీటి కొరత మరింత తీవ్రమయ్యే పరిస్థితి రానుండడంతో జిల్లావాసులు ఆందోళనకు గురవుతున్నారు.

12 మండలాల్లో ప్రమాద ఘంటికలు..

జిల్లాలోని 12 మండలాల్లో భూగర్భ జల నీటి మట్టాలు అడుగంటాయి. అతి నీటి వినియోగం వల్ల నీటి మట్టం పాతాళంలోకి వెళ్లింది. జిల్లాలోని శేరిలింగంపల్లిలో నీటిగండం ఏర్పడే ప్రమాదం ముంచుకొస్తుంది. ప్రస్తుతం ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. ఇప్పటికే మైనస్ 21.82 మీటర్ల లోతులోకి వెళ్లింది. దీని తర్వాత స్థానంలో ఇబ్రహీంపట్నం మండలం ఉంది. ఈ మండలంలో నీటిమట్టం మైనస్ 12.96 మీటర్లు ఉన్నట్లు భూగర్భ జల అధికారుల లెక్కలు చెబుతున్నాయి. హయత్‌నగర్, మంచాల, తలకొండపల్లి, కడ్తాల్, యాచారం, షాబాద్, కందుకూరు, చౌదరిగూడెం,కొత్తూరు మహేశ్వరం మండలాల్లో కూడా నీటిమట్టం తగ్గిపోయింది.

ఇష్టానుసారంగా బోర్ల వాడకం

గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఇష్టానుసారంగా తాగునీటి కోసం సాధారణ బోరు బావులను ఇష్టారాజ్యంగా తవ్వుతుండడంతో భూగర్భజలాలు వేగంగా అడుగంటిపోయేందుకు కారణమవుతున్నాయంటున్నారు భూగర్భ జల శాఖ అధికారులు. ప్రభుత్వం బోరు బావుల తవ్వకాలను అరికట్టేందుకే కాకుండా భూగర్భ జలాల పెంపు కోసం అమలు చేస్తున్న వాల్టా చట్టం కూడా ఎక్కడ అమలు కావడం లేదన్న విమర్శలున్నాయి. సంబంధిత అధికారులు వాల్టా చట్టంపై అవగాహన కల్పించకపోవడం, ఆ చట్టానికి అనుగుణంగా చర్యలు తీసుకోకపోతుండడంతో బోరుబావుల తవ్వకాలకు అడ్డూ అదుపు లేకుండా పోయిందంటున్నారు.

అడుగంటిన చెరువులు, కుంటలు..

జిల్లాలో ఎండ తీవ్రత అధికంగా ఉన్నాయి. దీనికి తోడు యాసంగి పంటలు 90 శాతం బోరు బావులపై ఆధారపడే సాగు చేశారు. దీంతో నీటి వినియోగం పెరిగి భూగర్భ నీటి మట్టం వేగంగా తగ్గుతోంది. మార్చి ప్రారంభంలోనే భానుడు భగ్గుమంటున్నాడు. మేలో ఇప్పటికే 44 డిగ్రీల ఉష్ణోగ్రత దాటింది. ఎండ వేడిమికి నీటిమట్టాలు అడుగంటున్నాయి. బోరు బావుల్లో నీరు అడుగంటడంతో కొన్నిచోట్ల కూరగాయల పంటలు ఎండిపోతున్నాయి.

తగ్గిన వర్షపాతం..

జిల్లాలో గతేడాది ఏప్రిల్‌లో జిల్లా సగటు వర్షపాతం 695.7 మిల్లిమీటర్లు ఉండగా ఈసారి ఏప్రిల్‌లో 667.5 మిల్లిమీటర్ల వర్షపాతం నమోదైంది. గత ఏడాది ఏప్రిల్, ఈ ఏడాది ఏప్రిల్ నెలలో నమోదైన వర్షపాతాన్ని పోల్చుకుంటే.. 4.0 మిల్లిమీటర్లు తక్కువగా నమోదైంది.

ప్రమాద స్థాయిలో ఉన్న మండలాలు (నీటి మట్టం: మీటర్లలో)

మండలం	ఏప్రిల్-23	ఏప్రిల్-24	వ్యత్యాసం
శేరిలింగంపల్లి	20.3	42.12	-21.82
ఇబ్రహీంపట్నం	11.16	24.12	-12.96
హయత్‌నగర్	12.3	21.15	-8.85
మంచాల	7.15	14.34	-7.19
తలకొండపల్లి	13.9	19.01	-5.12
కడ్తాల్	11.52	16.45	-4.93
యాచారం	5.76	10.25	-4.49
షాబాద్	11.54	15.39	-3.85
కందుకూరు	5.47	9.20	-3.73
చౌదరిగూడ	14.35	17.94	-3.58
కొత్తూరు	10.54	14.02	-3.48
మహేశ్వరం	10.64	14.03	-3.39

భూగర్భ జల నీటి మట్టం (మీటర్లలో)

మండలం	ఏప్రిల్-23	ఏప్రిల్-24	వ్యత్యాసం
అబ్దుల్లాపూర్‌మెట్	9.99	11.19	-1.20
ఆమనగల్లు	8.15	9.78	-1.64
బాలాపూర్	8.95	11.17	-2.24
చేవెళ్ల	11.5	13.36	-1.86
ఫరూక్‌నగర్	9.11	11.99	-2.88
గండిపేట	10.31	10.75	-0.44
కేశంపేట	5.42	6.95	-1.53
కొందుర్గు	8.27	10.33	-2.06
మాడ్గుల	8.37	8.54	-0.17
మొయినాబాద్	9.15	11.62	-2.47
నందిగామ	9.42	12.33	-2.91
రాజేంద్రనగర్	11.21	12.43	-1.22
సరూర్‌నగర్	10.83	12.14	-1.31
శంషాబాద్	11.09	12.40	-1.31
శంకర్‌పల్లి	13.95	14.95	-1.00

పార్లమెంట్ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

- జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ శశాంక



స్ట్రాంగ్‌రూమ్ వివరాలపై మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

రంగారెడ్డి అర్బన్, మే 9 : పార్లమెంటు ఎన్నికలను సజావుగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని చేవెళ్ల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ శశాంక తెలిపారు. గురువారం చేవెళ్లలో బండారీ శ్రీనివాస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్ కళాశాలలో ఏర్పాటు చేస్తున్న కౌంటింగ్ కేంద్రాన్ని, స్ట్రాంగ్ రూమ్‌ను సాధారణ ఎన్నికల పరిశీలకులు రాజేందర్ కుమార్ కటారియా, పోలీస్ పరిశీలకులు కాలురామ్ రావత్, వ్యయ పరిశీలకులు రాజీవ్ చాబ్రా, వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డిలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ చేవెళ్ల పార్లమెంట్ నియోజక వర్గానికి సంబంధించిన మహేశ్వరం, రాజేంద్రనగర్, చేవెళ్ల, శేరిలింగంపల్లి, పరిగి, వికారాబాద్, తాండూర్ అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలలో ఏర్పాట్లను పరిశీలించినట్లు చెప్పారు. పోలింగ్ సిబ్బందికి మౌలిక సదుపాయాలు కల్పించామని, పోలింగ్ రోజు సిబ్బంది ఇబ్బందులు పడకుండా అన్ని ఏర్పాట్లు చేపట్టామని తెలిపారు. ప్రతీ పోలింగ్ కేంద్రంలో మహిళా పోలీస్‌ను అందుబాటులో ఉంచుతున్నామన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో వెబ్ క్యాస్టింగ్ చేపట్టాలని ఏఆర్‌ఓలకు సూచించారు. డిస్ట్రిబ్యూషన్ సెంటర్లలో ఏర్పాట్లపై వారికి తగు సూచనలు జారీ చేశామన్నారు. కౌంటింగ్ సెంటర్, స్ట్రాంగ్ రూముల వద్ద మూడంచెల భద్రత ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. కేంద్ర బలగాల ఆధ్వర్యంలో స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రం వద్ద ఏర్పాటు, కౌంటింగ్ ప్రక్రియకు అవసరమైన సిబ్బంది, నియామకం.. అవసరమైన సామగ్రి ఏర్పాట్ల పనులు పూర్తయినట్లు తెలిపారు. సి-విజిల్ యాప్ ద్వారా ఇప్పటి వరకు వచ్చిన ఫిర్యాదులను పరిష్కరించామని తెలిపారు. గత అసెంబ్లీ ఎన్నికలలో ఓటింగ్ శాతం తక్కువగా నమోదైన అర్బన్ ప్రాంతాల్లోని ప్రజలకు ఓట్ హక్కు వినియోగంపై అవగాహన కల్పించామని వివరించారు. సమావేశంలో సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి, వికారాబాద్ ఎస్పీ కోటిరెడ్డి, అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, వికారాబాద్ అదనపు కలెక్టర్లు రాహుల్ శర్మ, ఉమా హారతి, శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ స్నేహ, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, చేవెళ్ల డీసీపీ శ్రీనివాస్, ఏఆర్‌వోలు, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

బల్క్ ఎస్ఎంఎస్‌లు నిషేధం

పోలింగ్‌కు 48 గంటల ముందు నిశ్శబ్ద వ్యవధి అమలులో ఉంటుందని కలెక్టర్ శశాంక తెలిపారు. సైలెన్స్ పీరియడ్‌లో భాగంగా 11వ తేదీ సాయంత్రం 6 గంటల నుండి 13వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు ఎలాంటి అభ్యంతకరమైన, రాజకీయపరమైన అంశాలతో కూడిన సంక్షిప్త సందేశాలు, బల్క్ ఎస్ఎంఎస్‌లపై ఎన్నికల సంఘం నిషేధం విధించిందని తెలపారు. సామాజిక మాధ్యమాలలో వచ్చే బల్క్ ఎస్ఎంఎస్‌లను నిశితంగా పర్యవేక్షిస్తున్నామన్నారు. సైలెన్స్ పీరియడ్‌లో నిషేధ ఉత్తర్వులను ఉల్లంఘిస్తూ ఎవరైనా అభ్యంతరమైన ఎస్ఎంఎస్‌లు, రాజకీయపరమైన బల్క్ ఎస్ఎంఎస్‌లు పంపితే విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. అదేవిధంగా ఎస్ఎంఎస్‌లను పంపడానికి అయ్యే ఖర్చులను కూడా పరిగణనలోకి తీసుకుంటామని కలెక్టర్ శశాంక తెలిపారు.

11న సాయంత్రం నుంచి ప్రచారాలు బంద్

11వ తదీ సాయంత్రం నుంచి ప్రచార కార్యక్రమాలు నిషేధమని రిటర్నింగ్ అధికారి శశాంక తెలిపారు. పార్లమెంటు ఎన్నికల పోలింగ్ ప్రక్రియను పురస్కరించుకుని ఎలక్షన్ కమిషన్ నియమావళిని అనుసరిస్తూ ఈ నెల 11 సాయంత్రం 6 గంటల నుండి ప్రచార కార్యక్రమాలపై నిషేధం అమలులోకి వస్తుందని, ఎన్నికలు ముగిసే వరకు జిల్లాలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని ఆయన తెలిపారు. జిల్లాయేతర వ్యక్తులు ఎవరూ జిల్లాలో ఉండకూడదని స్పష్టం చేశారు. ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ, ఎంసీసీ, పోలీస్ అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని, కల్యాణ మండపాలు, హోటళ్లు, లాడ్జిలు తనిఖీ చేయాల్సిందిగా కలెక్టర్ సూచించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఒపీనియన్ పోల్, ఎగ్జిట్ పోల్స్ నిషేధమని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ నెల 6 సాయంత్రం గంటల నుండి ఎన్నికలు ముగిసే వరకు జిల్లాలో మద్యం షాపులను మూసివేయాలని ఆదేశించారు.

అనుమతి లేకుండా ప్రచార ప్రకటనలు ప్రచురించరాదు

ఎన్నికల సంఘం నిబంధనల మేరకు మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ) అనుమతి లేకుండా పోలింగ్ రోజున, అలాగే పోలింగ్‌కు ఒక రోజు ముందు ప్రింట్ మీడియాలో ఎలాంటి ఎన్నికల ప్రచార ప్రకటనలను ప్రచురించకూడదని కలెక్టర్ శశాంక తెలిపారు. వివిధ రాజకీయ పక్షాలు, అభ్యర్థులు, ఇతరులు ఎవరైనా సరే ముందస్తుగా ఎంసీఎంసీ ద్వారా అనుమతి కోసం దరఖాస్తు చేసుకుని ధ్రువీకరణ పొందాలని సూచించారు. లేని పక్షంలో ఎన్నికల కమిషన్ తగు చర్యలు చేపట్టే అవకాశం ఉందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఈ నెల 12, 13 తేదీలలో ప్రింట్ మీడియాలో (ఆయా పత్రికలలో) ఎన్నికల ప్రచార ప్రకనటలు ప్రచురితం చేయాలనుకునే వారు తప్పనిసరిగా ఎంసీఎంసీ ద్వారా ముందస్తు అనుమతి తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఎన్నికల ప్రక్రియకు విఘాతం కలిగించే రీతిలో ఆవేశపూరితమైన, తప్పుదోవ పట్టించే, ద్వేషపూరిత ప్రకటనలకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతి ఇవ్వబడదని స్పష్టం చేశారు.

13న వేతనంతో కూడిన సెలవు

ఈనెల 13వ తేదీన పార్లమెంటు ఎన్నికల పోలింగ్ జరగనున్న సందర్భంగా ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకునేందుకు వీలుగా ప్రభుత్వం వేతనంతో కూడిన సెలవు దినంగా ప్రకటించిందని చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ శశాంక తెలిపారు. సోమవారం అన్ని ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలకు, పరిశ్రమలకు వేతనంతో కూడిన సెలవుదినంగా ప్రకటించారని కలెక్టర్ తెలిపారు.

విద్య, ఆరోగ్యం ప్రాముఖ్యతగలవి

- హైకోర్టు న్యాయమూర్తి విజయ్‌సేన్‌రెడ్డి



అకాడమీని ప్రారంభిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి విజయ్‌సేన్‌రెడ్డి

శంషాబాద్, మే 9 : ప్రతి మనిషికీ విద్య, ఆరోగ్యం చాలా ప్రాముఖ్యత కలిగినవని హైకోర్టు న్యాయమూర్తి విజయ్‌సేన్ రెడ్డి అన్నారు. శంషాబాద్ మున్సిపల్ కేంద్రంలో బుచ్చిరెడ్డి కుటుంబం నిర్మించిన అకామ్లిష్ అకాడమీని ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి అధునాతన తరానికి తగ్గట్టుగా అన్ని సదుపాయాలతో అకాడమీని నిర్మించడం చాలా శ్రమతో కూడిందన్నారు. గతంలో విద్యను అభ్యసించే వారికి ఇప్పుడు ఉన్నట్టు సౌకర్యాలు ఉండేవి కావన్నారు. అకాడమీలో చేరిన యువతీ యువకులు వివిధ కోర్సులను అభ్యసించి.. అందులో నైపుణ్యత సాధించి తమ భవిష్యత్తును చక్కదిద్దుకోవాలని విద్యార్థులకు సూచించారు. విద్యను బోధించే ఉపాధ్యాయులు తమ అకాడమీకి వచ్చే విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించేలా తీర్చిదిద్దాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మా మహేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ బండి గోపాల్‌యాదవ్, కౌన్సిలర్లు, మాజీ సర్పంచ్ ఆర్. గణేశ్‌గుప్తా, స్థానిక నాయకులు దూడల వెంకటేశ్‌గౌడ్, ప్రసాద్, శ్రీనివాస్, దేవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆమనగల్లులో పోలీసుల ఫ్లాగ్‌మార్చ్

ఆమనగల్లు, మే 9: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఓటర్లలో భద్రత భావాన్ని పెంపొందించి నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకునేందుకు పోలీసు శాఖ ఆధ్వర్యంలో గురువారం ఆమనగల్లు పట్టణంలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. సాయుధ పోలీసు బలగాలు, స్థానిక పోలీసులతో కలిసి సీఐ ప్రమోద్ కుమార్, ఎస్ఐ బాల్‌రామ్ నాయక్ ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ ప్రమోద్‌కుమార్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు పోలీసు శాఖ ఆధ్వర్యంలో ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఓటర్లు నిర్భయంగా తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని కోరారు.

మేము చేసిన అభివృద్ధి చూసి ఓటేయండి

కాంగ్రెస్ పాలనలో ప్రజలకు అన్నీ కష్టాలే

- జడ్పీచైర్మన్‌గా ఉమ్మడి జిల్లాను ఎంతో అభివృద్ధి చేశా
- ఎంపీగా గెలిపిస్తే బడుగు, బహీనవర్గాలకు అండగా ఉంటా
- బీఆర్ఎస్ హయాంలో శివారు ప్రాంతాల అభివృద్ధి
- చేవెళ్ల పార్లమెంట్ టీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి)

ఇంటర్వ్యూ...

గత టీఆర్ఎస్ ప్రభుత్వం హయంలో జరిగిన అభివృద్ధి, అమలైన సంక్షేమ పథకాలను ఇపుడు ప్రజలు పదే పదే గుర్తుకు తెచ్చుకుంటున్నారని చేవెళ్ల పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ పేర్కొన్నారు. అధికార కాంగ్రెస్ పాలనలో అన్ని విధాలా విఫలమైందని.. ఏ ఒక్క హామీ సరిగా నెరవేర్చలేదన్నారు. గతంలో తమ పార్టీ చేసిన అభివృద్ధిని చూసి ఓట్లేయాలని ఆయన ప్రజలను కోరుతున్నారు. చేవెళ్ల పార్లమెంట్ పరిధిలో విస్తృతంగా ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్న ఆయన గురువారం 'ఆంధ్రజ్యోతి'కి ఇంటర్వ్యూ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన పలు అంశాలపై మాట్లాడారు. గతంలో తాను జడ్పీ చైర్మన్‌గా, ఎమ్మెల్సీగా ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ఎన్నో అభివృద్ధి పనులు చేశానని.. ఈ ఎన్నికల్లో ఎంపీగా గెలిపిస్తే ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పని చేస్తానన్నారు. ఇంటర్వ్యూలో ఆయన ఏమన్నారంటే..

కాంగ్రెస్ చేసిందేమీ లేదు


చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు మా వైపే ఉన్నారు. కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఈ రాష్ట్ర ప్రజలకు ఇప్పటి వరకు చేసిందేమీ లేదు. పేరుకే గ్యారెంటీలు కానీ ఒక్కదాన్నీ ఇప్పటి వరకు నెరవేర్చలేదు. అందుకే ప్రజలు కూడా విసిగిపోయారు. ఎక్కడకు వెళ్లినా టీఆర్ఎస్ పాలనే బాగుందంటున్నారు. ఇచ్చిన హామీలు నెరవర్చని కాంగ్రెస్ మళ్లీ ప్రజలను ఓటు అడిగే హక్కును కోల్పోయింది. రాష్ట్రంలో కరువు పరిస్థితులు నెలకొన్నాయి. కరెంట్, నీళ్ల కోసం జనం అల్లాడుతున్నారు. పట్టణ ప్రాంతాల్లో పరిస్థితి మరింత ఘోరంగా ఉంది. నగర, శివారు ప్రాంతాల్లో గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రజలు తాగునీటి కోసం విలవిల్లాడుతున్నారు. రుణమాఫీ లేదు... రైతుబంధు లేదు... ఆడపిల్లలకు తులం బంగారం పథకం ఎక్కడకు పోయిందో తెలియదు. అధికార పార్టీ నేతల అబద్ధాలు, శుష్క వాగ్దానాలను ప్రజలు అర్థం చేసుకున్నారు. బీజేపీ కూడా ప్రజల మధ్య చిచ్చుపెట్టి రాజకీయం నడపాలని చూస్తోంది. పదేళ్ల పాటు అధికారంలో ఉన్న బీజేపీ ఈ ప్రాంతానికి ఏ ఒక్క మంచి పనీ చేయలేదు. ఉమ్మడి

మిగతా 6వ పేజీలో...











మేము చేసిన అభివృద్ధి చూసి ఓటేయండి

(ఐదో పేజీ తరువాయి)

రంగారెడ్డి జిల్లా చుట్టూ కొన్ని లక్షల మందికి ఉపాధి కల్పించేందుకు తీసుకువచ్చిన ఐటీఐఆర్ ప్రాజెక్టును గంగలో కలిపారు. రాష్ట్రం కోసం ఒక్క ప్రాజెక్టునూ బీజేపీ నేతలు తీసుకురాలేక పోయారు. అందుకే ప్రజలు కాంగ్రెస్, బీజేపీలకు బుద్ధి చెప్పేందుకు సిద్ధమవుతున్నారు.

బడుగులకు బాసటగా ఉంటా...

చేవెళ్ల పార్లమెంట్ స్థానంలో పోటీ చేసేందుకు అవకాశం కల్పించిన పార్టీ అధినేత కేసీఆర్‌కు రుణపడి ఉంటాను. అతిపెద్ద నియోజకవర్గాల్లో ఒక్కటైన చేవెళ్ల పార్లమెంట్ స్థానం నుంచి వెనుకబడిన వర్గానికి చెందిన నాకు పోటీ చేసే అవకాశం కల్పించారు. మాజీ మంత్రి కేటీఆర్, సబితారెడ్డి సహకారంతో పాటు ఎమ్మెల్యేలు, బీఆర్ఎస్ ముఖ్యనేతల సహకారంతో ఈ ఎన్నికల్లో విజయం సాధించబోతున్నాం. గత బీఆర్ఎస్ పాలనలో చేసిన అభివృద్ధి పనులే నన్ను గెలిపించబోతున్నాయి. ప్రతిష్ఠాత్మకమైన చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికల్లో నన్ను గెలిపిస్తే బడుగులకు బాసటగా ఉంటాను. నా జీవితమంతా బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికే పాటుపడ్డాను. అణగారిన వర్గాల కోసం ఇంకా చేయాల్సింది ఎంతో ఉంది. నాకు ఇక్కడ నుంచి ఎంపీగా అవకాశం కల్పిస్తే ఈ ప్రాంత ప్రజలకు మరింత సేవ చేస్తాను. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అభివృద్ధి కోసం ఎంతో కాలం పనిచేశాను. ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్మన్‌గా ఈ ప్రాంతంలో రోడ్లు, స్కూళ్లు నిర్మించడంతో పాటు తాగునీటి పథకాలను దాదాపు అన్ని గ్రామాల్లో అమలు చేసేందుకు కృషి చేశాను. నేను ఈ ప్రాంతం వాడిని. ఈ ప్రాంత ప్రజలకు కొన్ని దశాబ్దాల అనుబంధం ఉంది. మిగతా అభ్యర్థులను కూడా బేరీజు వేసుకుని ఎన్నికల్లో ఓటు వేయండి. ఎన్నికల ప్రచారంలో బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు చూపుతున్న ఆదరాభిమానాలకు అంతా ఇంతా కాదు. ప్రచారానికి ఎక్కడకు వెళ్లినా ప్రజలంతా ఉత్సాహంతో సభలకు వస్తున్నారు.



111 జీవో సమస్యను శాశ్వతంగా పరిష్కరించాం

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో హైదరాబాద్ శివార్లలో రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాలు పెద్ద ఎత్తున కల్పించాం. కేటీఆర్ కృషితో ఎన్నో అంతర్జాతీయ కంపెనీలు ఇక్కడ కొలువుదీరాయి. ఇందువల్ల లక్షలాది మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు వచ్చాయి. అలాగే హిమాయత్‌సాగర్ పరీవాహక ప్రాంతంలో అమల్లో ఉన్న 111జీవో వల్ల స్థానికంగా 83 ప్రాంతాల ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడ్డారు. హైదరాబాద్‌కు ఆనుకుని ఉన్న ఈ ప్రాంతాలు ఈ జీవో వల్ల అభివృద్ధికి నోచుకోక పోవడంతో మా ప్రభుత్వం ఈ జీవోను రద్దు చేసింది. గతంలో ఈ ప్రాంత ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ఈ జీవోను రద్దు చేయడంతో కొన్ని లక్షల మందికి ప్రయోజనం కలిగింది. ఈ ప్రాంతంలో భూములు ఉన్న రైతులు సంతోషపడ్డారు. ఇక ఉమ్మడి జిల్లాకు తాగు, సాగునీటిని అందించేందుకు రూపుదిద్దిన పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులు బీఆర్ఎస్ హయాంలోనే ప్రారంభమయ్యాయి. ఐటీ పార్కులు, ఇండస్ట్రియల్ పార్కులు, ఎన్నో ఏర్పాటు చేసి పారిశ్రామికంగా రాష్ట్రాన్ని ముందుకు తీసుకువెళ్లాం. ఇలా బీఆర్ఎస్ చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ఎన్నో ఉన్నాయి. వీటన్నింటినీ చూసి ఓటు వేయాలని ప్రజలను కోరుతున్నాను.








నేలరాలిన మామిడి కాయలు

ఈదురు గాలులకు నేలరాలిన మామిడి

» అకాల వర్షంతో అపార నష్టం

బొంరాస్‌పేట్, మే 9: ఈదురు గాలులు, అకాల వర్షంతో బొంరాస్‌పేట్ మండలంలో మామిడి నేల రాలింది. దీంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. బుధవారం రాత్రి భారీ ఈదురుగాలులు వీచాయి. మామిడి పంట చేతికందే సమయానికి ఈదురుగాలులతో కాయలు నేలరాలడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. మండల వ్యాప్తంగా దాదాపు 100 ఎకరాలకుపైగా మామిడి తోటలకు నష్టం వాటిల్లినట్లు సమాచారం. మదన్‌పల్లి, బొంరాస్‌పేట్, బురాన్‌పూర్, మెట్లకుంట, కాకర్లగండి తండా, నాగిరెడ్డిపల్లి, కొత్తూర్ తదితర గ్రామాల్లో భారీ ఈదురు గాలులకు మామిడి కాయలు నేలరాలాయి. మెట్లకుంట, బురాన్‌పూర్ గ్రామాల్లో ఈదురు గాలులకు చెట్లు విరిగి విద్యుత్ స్తంభాలపై పడటంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. మెట్లకుంట, బొంరాస్‌పేట్, బురాన్‌పూర్ ఐకేపీ కొనుగోలు కేంద్రాల దగ్గర రైతులు ఆరబోసిన వరి ధాన్యం తడిసి ముద్దయింది. నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ఆయాగ్రామాల రైతులు కోరారు.


సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ సీఈవో సుధీర్

ఎన్నికల సిబ్బందికి ఇబ్బంది లేకుండా చూడాలి

తాండూరు, మే 9: పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించాలని, పోలింగ్ సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని జడ్పీ సీఈవో సుధీర్ కోరారు. తాండూరు ఆర్డీవో కార్యాలయంలోని సమావేశ మందిరంలో గురువారం సెక్టోరల్ ఆఫీసర్లు, మున్సిపల్ మండల పరిషత్ సిబ్బందితో సమావేశమై పోలింగ్ రోజు, ముందు రోజు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఏర్పాట్లపై సమీక్షించారు. పోలింగ్ కేంద్రాల్లో కనీస సౌకర్యాలైన తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు, ఫర్నీచర్ ఏర్పాటు చేయించాలని సూచించారు. మండల మున్సిపల్ స్థాయిలో టీంను ఏర్పాటు చేసి సమన్వయంతో పనిచేయాలన్నారు. నలుగురు సభ్యులతో కూడిన మ్యాచింగ్, బ్యాచింగ్ టీమ్‌ను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పోలింగ్ రోజు ప్రతీ 2గంటలకు ఒకసారి రిపోర్టును ఇవ్వాలన్నారు. ఏడు రకాల సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందించాలన్నారు. ఈనెల 12, 13వ తేదీల్లో నియమించబడిన అధికారులు ఎక్కడా పొరపాట్లు జరగకుండా చూసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయశాఖ అధికారి గోపాల్, మున్సిపల్ కమిషనర్ విక్రంసింహారెడ్డి, సెక్టారోల్ ఆఫీసర్లు ఖాజాహుస్సేన్, రజిత, మహిపాల్‌రెడ్డి, శాంతప్ప, కిరణ్‌కుమార్, జైసింగ్, జి.వెంకటస్వామి, పి.రవీందర్‌గౌడ్, వెంకటయ్య, మహదేవి, మున్సిపల్ మేనేజర్ నరేందర్‌రెడ్డి, ఎంఈవో వెంకటయ్య పాల్గొన్నారు.

వడదెబ్బతో ఉపాధి కూలీ మృతి


కావలి లక్ష్మి(ఫైల్)

ధారూరు, మే 9: వడదెబ్బతో ఉపాధి హామీ కూలీ అస్వస్థతకు గురై మృతిచెందింది. ఈ ఘటన వికారాబాద్ జిల్లా ధారూరు మండలం, గురుదోట్ల గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కావలి లక్ష్మి(40) బుధవారం ఉదయం ఉపాధి పనికి వెళ్లింది. గ్రామం నుంచి కంత వెంబడి మైసమ్మ ఆలయం వరకు రోడ్డు పక్కన మట్టితీసే పనులు చేసి ఇంటికి వచ్చింది. నీళ్లు తాగి ఒంట్లో నలతగా ఉందని పడుకుంది. గమనించిన భర్త కృష్ణ ఆమెను ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తుండగానే స్పృహతప్పి పడిపోయింది. వికారాబాద్ ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే లక్ష్మి మృతిచెందినట్లు తెలిపారు. వడదెబ్బ తగిలి అస్వస్థతకు గురై లక్ష్మి మృతిచెందిందని మృతురాలి కుటుంబీకులు ఈజీఎస్ ఏపీవో సురేష్‌కు గురువారం సమాచారం అందించారు. దీంతో ఆయన ఈ ఘటనపై ఉన్నతాధికారులకు తెలియజేశారు. కాగా ఏపీవో సురేష్‌ను సంప్రదించగా పనిప్రదేశంలో వడదెబ్బ తగిలి అస్వస్థతకు గురై లక్ష్మి మృతి చెందినట్లు సమాచారం అందిందని చెప్పారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను సందర్శించిన అధికారులు

చేవెళ్ల, మే 9 : సార్వత్రిక ఎన్నికల నిబంధనలకు లోబడి రాజకీయ పార్టీల నాయకులు నడుచుకోవాలని చేవెళ్ల ఆర్డీవో సాయిరాం, చేవెళ్ల ఏసీపీ బంటు కిషన్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా గురువారం చేవెళ్ల మండలంలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను వారు సందర్శించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా రాజకీయ పార్టీలు, ప్రజలు అధికారులకు సహకరించాలని కోరారు. చేవెళ్ల మండల పరిధిలోని చేవెళ్ల, దామరగిద్ద, ఆలూర్ గ్రామాల్లో ఉన్న సమస్యాత్మక పోలింగ్ బూత్‌లను సందర్శించామని, గ్రామాల్లో ఎవరైనా ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టం పరంగా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల తహసీల్దార్ కృష్ణయ్య, సీఐ. లక్ష్మారెడ్డి తదితరులు ఉన్నారు.



ఆలూర్‌లోని పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న చేవెళ్ల ఆర్డీవో సాయిరాం, ఏసీపీ కిషన్

ఐదు నెలల్లో రాష్ట్రం అస్తవ్యస్తం

వికారాబాద్/నవాబుపేట/మోమిన్‌పేట/తాండూరు/తాండూరు రూరల్/బషీరాబాద్/పరిగి/దోమ, మే 9: కాంగ్రెస్ ప్రభుత్వం ఐదు నెలల్లో తెలంగాణ రాష్ట్రాన్ని అస్తవ్యస్తంగా చేసిందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. వికారాబాద్‌లోని కొండా బాలకృష్ణారెడ్డి గార్డెన్‌లో గురువారం జిల్లా అధ్యక్షుడు ఆనంద్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ ఎన్నికల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్, పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, ఎంపీపీ చంద్రకళ పాల్గొన్నారు. నవాబుపేట మండలంలోని ఎల్లకొండ, మైతాప్‌ఖాన్‌గూడ, లింగంపల్లి, గొల్లగూడ గ్రామాల్లో కాసాని జ్ఞానేశ్వర్‌కు మద్దతుగా చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రచారం నిర్వహించారు. అదేవిధంగా బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కందాడ నాగిరెడ్డి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. కాసాని జ్ఞానేశ్వర్‌కు ఈ ఎన్నికల్లో భారీ మెజారిటీ అందిస్తామన్నారు. సమావేశంలో రామ్‌రెడ్డి, డాక్టర్ జి.ప్రశాంత్‌గౌడ్ ఉన్నారు. అదేవిధంగా మోమిన్‌పేట్‌లోని ఇజ్రాచిట్టెంపల్లి, సయ్యద్ అలీపూర్ గ్రామాల్లో మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి

గురువారం ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెంకన్న పాల్గొన్నారు. అదే విధంగా తాండూరు పట్టణం సాయిపూర్‌లో పార్లమెంట్ ఎన్నికల్లో ప్రచారంలో భాగంగా మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి రోడ్ షోలో భాగంగా 9, 10, 11, 12, 28వార్డుల్లో ప్రచారం చేశారు. అదేవిధంగా విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి రుణమాఫీ చేస్తారని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికే నమ్మకంలేదని విమర్శించారు. కోటబాస్పల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. కాశింపూర్, గొట్టిగకలాన్, కుప్పన్‌కోట్ తదితర గ్రామాల్లో బషీరాబాద్ వైస్ ఎంపీపీ అన్నపూర్ణ అనంతయ్య ఇంటింటి ప్రచారం నిర్వహించారు. దోమ మండల కేంద్రంతో పాటు పోతిరెడ్డిపల్లి, ఉదన్‌రావుపల్లి తదితర గ్రామాల్లో ప్రచారం చేశారు. పరిగిలో మాజీ ఎమ్మెల్యే కె.మహేశ్‌రెడ్డి ఇంటింటి ప్రచారం చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి

కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ ఎం.అశోక్, సురేందర్, ప్రవీణ్‌రెడ్డి ఉన్నారు.

చేవెళ్ల బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కాసానిని గెలిపించాలి

చేవెళ్ల/కందుకూరు, మే 9: చేవెళ్ల బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపిస్తామని ఎమ్మెల్యే యాదయ్య అన్నారు. చేవెళ్ల మండలం కందవాడ, పలుగుట్ట, నారాయణదాస్‌గూడ, లొద్ది, కేసారం, దేవరంపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామాల్లో ప్రజలు బీఆర్ఎస్ వెంటే ఉన్నారన్నారు. మాజీ సీఎం కేసీఆర్‌కు సేవలను గుర్తు చేస్తున్నారని చెప్పారు. ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీలకు ప్రజలు బుద్ధి చెప్తారన్నారు. కారు గుర్తుకు ఓటేయాలని కోరారు. చేవెళ్ల ఇన్‌చార్జి రాంబాబు, ప్రభాకర్, శివారెడ్డి, చంద్రశేఖర్, ఎంపీటీసీ రవీందర్, వెంకటేశ్, కార్యకర్తలు పాల్గొన్నారు. చేవెళ్ల నియోజకవర్గంలోని బీసీల ఓట్లన్నీ కాసాని జ్ఞానేశ్వర్‌కే అని మాజీ ఎంపీపీ బాల్‌రాజ్, అన్నారు. మండల పరిధి ఓ ఫామ్‌హౌస్‌లో బీసీ కులసంఘాల నాయకులు సమావేశం నిర్వహించారు. బీసీలందరు ఐక్యంగా కాసాని గెలుపు కోసం కృషిచేయాలన్నారు. చేవెళ్ల బీఆర్ఎస్ అభ్యర్థి జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌కు రాజకీయాలకు అతీతంగా ఓట్లు వేయాలని కందుకూరు ఏఎంసీ చైర్మన్ ఎస్.సురేందర్‌రెడ్డి, ప్యాక్స్ చైర్మన్ డి.చంద్రశేఖర్ కోరారు. గురువారం కందుకూరు, సాయిరెడ్డిగూడల్లో ప్రచారాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు రాజశేఖర్‌రెడ్డి, టి.ఇందిరదేవేందర్, సురేష్, రాములు, నాయకులు లక్ష్మీనర్సింహారెడ్డి, మేఘనాథ్‌రెడ్డి, వెంకటేష్, ప్రకాశ్‌రెడ్డి, యాదయ్య, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.



చేవెళ్లలో జ్ఞానేశ్వర్‌కు మద్దతుగా సమావేశమైన బీసీ నాయకులు

కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలి

మల్కాజ్‌గిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్

వనస్థలిపురం/పేట్‌బషీరాబాద్/కొత్తపేట, మే 9: రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పి, తనను భారీమెజార్టీతో గెలిపించాలని మల్కాజ్‌గిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో మల్లికార్జుననగర్ సంక్షేమ సంఘం భవనంలో ఆదర్శ్ సీనియర్ సిటిజన్స్ ప్రతినిధులు నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడారు. అంతేకాకుండా కొత్తపేట కార్పొరేటర్ పవన్‌కుమార్ అధ్వర్యంలో శివగంగ కాలనీ సదాశివేశ్వరాలయంలో ప్రత్యేక పూజల అనంతరం ఈటల శివమ్మనగర్, అంబేడ్కర్‌నగర్, భరత్‌నగర్-1,2, రాజీవ్‌గాంధీనగర్ -1,2 బస్తీల్లో రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షులు సామరంగారెడ్డితో కలిసి పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర బీజేపీ నాయకులు యశ్పాల్‌గౌడ్ ఈటలకు తులసి మాల వేసి ఖడ్గం బహూకరించారు. జీడిమెట్ల డివిజన్‌లోని భూమిరెడ్డి కాలనీ, స్ప్రింగ్‌ఫీల్డ్ కాలనీ, భీమాఫ్రైడ్ అపార్టుమెంట్ తదితర ప్రాంతాల్లో ఈటల రాజేందర్ కుత్బుల్లాపూర్ నియోజక వర్గ నాయకులతో కలిసి ప్రచారాన్ని నిర్వహించారు. అపార్టుమెంట్ వాసుల ఆత్మీయ సమ్మేళనంలో ప్రసంగించారు. తనను గెలిపించాలని కోరారు. ఈటల రాజేందర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలనీ బీఎన్ రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి బీజేపీ శ్రేణులతో కలిసి ప్రచారం చేశారు.

బీజేపీ వైపే ప్రజల మొగ్గు

కీసర రూరల్ : దేశ ప్రజలు బీజేపీ వైపే మొగ్గు చూపుతున్నారని, మల్కాజ్‌గిరి ఎంపీ అభ్యర్థి ఈటల గెలుపునకు కార్యకర్తలంతా కృషి చేయాలని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి అన్నారు. గురువారం నాగారంలో ఈటల కోడలు క్షమితతో కలిసి బూత్‌కమిటీ అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో వేణు, బుద్ధవరం లక్ష్మి, రవీందర్‌రెడ్డి, జూపల్లి నరేష్, రాకేష్, సురేష్, కిషోర్ పాల్గొన్నారు.



మన్సూరాబాద్ డివిజన్‌లో మాట్లాడుతున్న ఈటల రాజేందర్

ఈటల సమక్షంలో బీజేపీలో చేరికలు

మేడ్చల్ టౌన్/ఘట్‌కేసర్ : శ్రీరంగవరం గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు చెందిన నాయకులతో పాటు గ్రామపెద్దలు గురువారం బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ సమక్షంలో పార్టీ చేరారు. పార్టీలో చేరిన వారు మోదీ గెలుపునకు కృషి చేయాలని ఈటల సూచించారు. కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజ్‌గిరి రూరల్‌జిల్లా అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి, అమరం మోహన్‌రెడ్డి పాల్గొన్నారు. ఘట్‌కేసర్ మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ ర్యాలీలో ఈటల పాల్గొన్నారు.ఈసందర్భంగా ఘట్‌కేసర్ పెరిక సంఘం జిల్లా అధ్యక్షుడు సోమసాని రమేష్‌కు ఈటల బీజేపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీజేపీని గెలిపించాలన్నారు.ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి, హనుమాన్, లక్ష్మారెడ్డి, లాలయ్య పాల్గొన్నారు.



ఈటల సమక్షంలో బీజేపీలో చేరుతున్న శ్రీరంగవరం గ్రామస్తులు

భారీ మెజార్టీతో గెలిపించాలి

శామీర్‌పేట: ఈటల రాజేందర్‌ను మల్కాజ్‌గిరి స్థానం నుంచి బీజేపీ ఎంపీ అభ్యర్థిగా భారీ మెజార్టీతో గెలిపించాలని బీజేపీ నాయకులు కాసుల కరుణాకర్‌గౌడ్, సుభాష్‌గౌడ్ ఓటర్లను కోరారు. తూంకుంట మున్సిపల్‌లో ఈటల రాజేందర్‌కు మద్దతుగా వారు ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

బీజేపీని నమ్ముకుంటే బీసీలకు బూడిదే

కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రంజిత్ రెడ్డి

ధారూరు/మొయినాబాద్/రాజేంద్రనగర్, మే 9: బీజేపీని నమ్ముకుంటే బీసీలకు బూడిదే మిగులుతుందని చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి జి.రంజిత్‌రెడ్డి అన్నారు. బీజేపీ జాతీయ మ్యానిఫెస్టోలో బీసీల ప్రస్తావనే లేదన్నారు. గురువారం వికారాబాద్‌లోని గోలీకర్ ఫంక్షన్ హాల్లో బీసీ సంఘాల సమావేశం జరిగింది. రంజిత్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. బీసీలకు అవకాశం, అధికారం, ఆత్మగౌరవం ఇవన్నీ కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. సమావేశానికి బీసీ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ హాజరయ్యారు., ఆర్‌టీయూ మాజీ చైర్మన్ శంకర్ వికారాబాద్‌లో మాట్లాడుతూ.. ప్రజలు కాంగ్రెస్ బ్రహ్మరథం పడుతున్నారన్నారు. పీసీసీ ప్రతినిధిగౌరీ సతీష్ వామపక్షాల నాయకులు ధారాసింగ్‌తో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాలకు అండగా ఉంటుందని ఎంపీ రంజిత్‌రెడ్డి అన్నారు. కల్లు గీతకార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు తాళ్ల శ్రీశైలంగౌడ్‌తో పాటు వివిధ మండలాల గౌడ సంఘాల నాయకులు మొయినాబాద్‌లో రంజిత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. షాబాద్ దర్శన్, పార్టీ మండల అధ్యక్షుడు మానయ్య, రామకృష్ణగౌడ్, రాజుగౌడ్, మహేష్‌గౌడ్, మల్లేష్‌గౌడ్, నర్సింలుగౌడ్ ఉన్నారు. అలాగే వెంకటాపూర్‌నకు చెందిన పలువురు నాయకులు శంకర్ కాంగ్రెస్‌లో చేరారు. అమ్డాపూర్‌నకు చెందిన నర్సింలుగౌడ్ కాంగ్రెస్‌లో చేరారు. మహేందర్‌రెడ్డి, మనోజ్‌కుమార్ ఉన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నేతలు జూబ్లీహిల్స్‌లో గల రంజిత్‌రెడ్డి నివాసానికి చేరుకొని ఆయన సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.



మాట్లాడుతున్న రంజిత్ రెడ్డి

రంజిత్‌రెడ్డి గెలుపు కోసం వాడవాడలా ప్రచారం

మహేశ్వరం/కందుకూరు/కులకచర్ల/చేవెళ్ల/పరిగి/ పూడూరు/ధారూరు/మోమిన్‌పేట్/యాలాల/సరూర్‌నగర్: చేవెళ్ల లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని రంగారెడ్డి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ అనితారెడ్డి, మహేశ్వరం కాంగ్రెస్ ఇన్‌చార్జి కె.లక్ష్మారెడ్డి అన్నారు. అమీర్‌పేట, గట్టుపల్లి, మన్‌సాన్‌పల్లి, డబిల్‌గూడ, మహేశ్వరం, తుమ్మలూరు, మొహబ్బత్‌నగర్, కోళ్లపడకల్, దిల్వార్‌గూడ గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. కేంద్రంలో, రాష్ట్రంలో బీజేపీ, బీఆర్ఎస్‌లు పదేండ్లు అధికారంలో ఉండి పేదలకు చేసిందేమీ లేదన్నారు. కాంగ్రెస్‌ది పేద ల ప్రభుత్వం అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభంజనం ఖాయం అన్నారు. చేతి గుర్తుకు ఓటేసి రంజిత్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఇన్చార్జి ఎంపీపీ ఆర్.సునిత, రాఘవేందర్‌రెడ్డి, దేవేదర్‌నాయక్, తారాసింగ్ పాల్గొన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డిని గెలిపించుకోవాలని కందుకూరు జడ్పీటీసీ బొక్క జంగారెడ్డి కోరారు. ధన్నారంలో ప్రచారం చేశారు. పీసీసీ సభ్యుడు ఏనుగు జంగారెడ్డి అకులమైలారంలో ప్రచారం చేశారు. జహింగ్‌పీర్ల దర్గా వద్ద ప్రార్థన చేశారు. శేఖర్‌రెడ్డి, అఫ్జల్‌బేగ్, ప్రభాకర్‌రెడ్డి, ఎ.పాండుగౌడ్, కె.విఘ్నేశ్వర్‌రెడ్డి, ఢిల్లీ శ్రీధర్, యాదగిరి, రవీందర్, వెంకట్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తామని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. చౌడాపూర్ మండలం మందిపాల్‌లో సొసైటీ చైర్మన్ నాగరాజుయాదవ్, ఆయన సతీమణి,మాజీ జడ్పీటీసీ మంజుల ఆధ్వర్యంలో 100మంది కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎంపీపీ సత్యమ్మ, ప్యాక్స్ చైర్మన్ మొగులయ్య, అశోక్, ఆంజనేయులు, భరత్‌కుమార్, గోపాల్, సాయికుమార్, రవి పాల్గొన్నారు. పేదలరిక నిర్మూలనకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని చేవెళ్ల కాంగ్రెస్ ఇన్‌చార్జి భీం భరత్, రాష్ట్ర నాయకుడు సత్యనారాయణరెడ్డి అన్నారు. చేవెళ్ల మండలం కుమ్మెరలో ప్రచారం చేశారు. దివ్యాంగుల సంపూర్ణ మద్దతు కాంగ్రెస్‌కే అని తెలంగాణ దివ్యాగుల సంఘాల జెఏసీ కన్వీనర్ డాక్టర్ నాగేశ్వర్ రావు అన్నారు. చేవెళ్లలో దివ్యాంగులతో కలిసి మాట్లాడారు. ఎంపీగా మరోసారి రంజిత్‌రెడ్డినే గెలిపించుకునేందుకు చేతి గుర్తుకు ఓటేద్దామని పిలుపునిచ్చారు. భాస్కర్, జంగయ్య, సుధాకర్, నాగభూషణం పాల్గొన్నారు.

బీజేపీ, బీఆర్ఎస్‌లను ఓడించాలని డీసీసీ పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి, పీసీసీ కార్యదర్శి గౌరీసతీష్, టీజేఎస్ వెంకట్‌రాంలు, పెద్దేముల్ జడ్పీటీసీ ధారాసింగ్ కోరారు. పరిగిలో మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ రిజర్వేషన్ల రద్దుకు బీజేపీ పాల్పడుతోందన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ పాలనలో ఉపాధి హామీ, ఆహార భద్రత వంటి చట్టాలు తెచ్చారన్నారు. రాష్ట్రంలో త్వరలో రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని తెలిపారు. డీసీసీ ఉపాధ్యక్షుడు ఎం.లాల్‌కృష్ణప్రసాద్, బి.పరశురాంరెడ్డి, పీర్ మహ్మద్, పాల్గొన్నారు. రంజిత్‌రెడ్డికి ఓటు వేయాలని పూడూరు మండల గ్రామాల్లో సీపీఎం నాయకులు పి.రామకృష్ణ ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. కాంగ్రెస్ అభ్యర్థి విజయం కోసం ధారూరు మండలంలో కాంగ్రెస్ శ్రేణులు ప్రచారాన్ని హోరెత్తిచాయి. రాఘవన్ నాయక్ ఆధ్వర్యంలో తండాల్లో ప్రచారం చేశారు. అలాగే మాల ప్రజాసంఘాల జేఏసీ చైర్మన్ జి.చెన్నయ్య వికారాబాద్‌లో విలేకరులతో మాట్లాడారు. బీజేపీ పాలనలో దళిత, గిరిజ, మైనార్టీలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. మోమిన్‌పేట్ కాంగ్రెస్ అధ్యక్షుడు శంకర్‌యాదవ్, నరోత్తంరెడ్డిల ఆధ్వర్యంలో బీఎస్పీ నాయకులు సురేందర్, శ్రీకాంత్, రవికుమార్, నరేశ్, రవికుమార్ తదితరులు స్పీకర్ ప్రసాద్‌కుమార్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. తాండూరులో బీఆర్ఎస్‌కు షాక్ తగిలింది. మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి అనుచరుడు విఠల్‌నాయక్ కాంగ్రెస్‌లో చేరారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, యాలాల ప్యాక్స్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, సిద్రాల శ్రీనివాస్, కరణం పురుషోత్తం రావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సిరెడ్డిల ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. రంజిత్‌రెడ్డికి మద్దతుగా బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లో పార్టీ నాయకులు, కార్యకర్తలతో పాటు పీసీసీ ప్రధాన కార్యదర్శి, మేయర్ చిగిరింత పారిజాత, కార్పొరేటర్లు విస్తృతంగా పర్యటిస్తూ చేతి గుర్తుకు ఓటేయాలని కోరారు. బాలాపూర్ 17వ డివిజన్ కాలనీల్లో కౌన్సిల్ వంగేటి ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు.

ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలి

మేడ్చల్, మే 9(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పార్లమెంటు ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలని జనరల్ అబ్జర్వర్ డాక్టర్ ఎం.ఎస్.ప్రియాంక శుక్లా అన్నారు. కలెక్టరేట్‌లో గురువారం పోలీసు అబ్జర్వర్ డాక్టర్ రామేశ్వర్ సింగ్, వ్యయ పరిశీలకులు మనోజ్ అలోయిస్ లక్రా, ధ్రువ్ భోళా, జిల్లా ఎన్నికల అధికారి గౌతమ్, పోలీసు అధికారులు, ఏఆర్ఓలు, నోడల్ అధికారులతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎన్నికల నియమనిబంధనలు అనుసరించి జిల్లాలో నోడల్ అధికారులు, పోలీసు అధికారులు తమకు కేటాయించిన విధులను నిర్వర్తించాలని సూచించారు. మల్కాజిగిరి పార్లమెంటు నియోజకవర్గంలో 72గంటల కంటే ముందు పోలింగ్‌కు సంబంధించిన ఏర్పాట్లు చేయాలన్నారు. పోలింగ్‌స్టేషన్‌లలో ఎన్నికల నిర్వహణ సామగ్రిని సంబంధిత సెక్టోరియల్ అధికారులు, ప్రిసైడింగ్ అధికారులు ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా మెటీరియల్ పంపిణీ చేయాలన్నారు. మెడికల్ కిట్స్, చల్లటి తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, 108అంబులెన్సులు అందుబాటులో ఉంచాలన్నారు. 100మీటర్ల దూరం లైన్ మార్కు ఉండాలన్నారు. పోలింగ్ రోజు ఉదయం ఐదు గంటలకు ఏజెంట్ల సమక్షంలో మాక్‌పోల్ నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో జోనల్ కమీషనర్ అభిలాష్ అభినవ్, డీసీపీ నిఖిత పంత్, డీసీపీ పద్మ, అదనపు కలెక్టర్‌లు అభిషేక్ అగస్త్య, విజేందర్‌రెడ్డి, డీఆర్‌ఓ హరిప్రియ, ఏఆర్‌వోలు సంబందిత అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జనరల్ అబ్జర్వర్ డాక్టర్ ఎం.ఎస్.ప్రియాంక శుక్లా

ఎన్నికల ప్రక్రియ సజావుగా నిర్వహించాలి

ఎన్నికల ప్రక్రియను సజావుగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి గౌతమ్ తెలిపారు. కలెక్టరేట్‌లో గురువారంఎన్నికలపై మల్కాజిగిరి, మేడ్చల్, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, ఉప్పల్ ఏఆర్‌ఓలకు తగిన సలహాలు, సూచనలు చేశారు. ఎన్నికలలు పారదర్శకంగా జరిగేలా ఏఆర్‌ఓలు బాధ్యతాయుతంగా పనిచేయాలన్నారు. మల్కాజిగిరి నియోజకవర్గ పరిధిలోని ఎలక్షన్ కమిషన్ నియమ నిబంధనల ప్రకారం ఆరు సింబల్ లోడింగ్ యూనిట్లను పోటీలో ఉన్న అభ్యర్థుల ఏజెంట్ల సమక్షంలో స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపర్చడం జరిగిందని జిల్లా ఎన్నికల అధికారి గౌతమ్ తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి ఆయా పార్టీల నేతలు పాల్గొన్నారు.

ఓట్ల లెక్కింపులో జాగ్రత్తలు తీసుకోవాలి

జిల్లా ఎన్నికల అధికారి నారాయణరెడ్డి

వికారాబాద్, మే 9 (ఆంధ్రజ్యోతి): పార్లమెంటరీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ సజావుగా కొనసాగేలా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి నారాయణరెడ్డి అన్నారు. చేవెళ్ల సమీపంలోని బండారి శ్రీనివాస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో చేవెళ్ల పార్లమెంటరీ లెక్కింపు కేంద్రంలో గురువారం ఓట్ల లెక్కింపు ఏర్పాట్లపై ఎన్నికల సాధారణ పరిశీలకులు రాజేందర్‌కుమార్ కఠారియా, వ్యయ పరిశీలకుడు రాజీవ్ ఛావ్లా, పోలీసు పరిశీలకుడు కాలూరాం రావత్, సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి, చేవెళ్ల పార్లమెంటరీ రిటర్నింగ్ అధికారి శశాంక్, వికారాబాద్ జిల్లా ఎన్నికల అధికారి నారాయణరెడ్డి, ఎస్పీ కోటిరెడ్డి ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం కళాశాలలో నిర్వహించే ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని వికారాబాద్ జిల్లా ఎన్నికల అధికారి నారాయణరెడ్డి, ఎస్పీ కోటిరెడ్డి, ఏఆర్‌వో రాహుల్ శర్మ, అసిస్టెంట్ కలెక్టర్ ఉమా హారతి, పరిగి, తాండూరు నియోజకవర్గాల ఏఆర్‌వోలతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఈవీఎంలను భద్రపరిచే స్ట్రాంగ్ రూంలు, సీలింగ్ గదులు, సీసీ కెమెరాల పనితీరును వారు పరిశీలించారు. కళాశాలలోని రెండవ అంతస్థులో పరిగి, వికారాబాద్ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు, మూడవ అంతస్థులో తాండూరు నియోజకవర్గ ఓట్ల లెక్కింపు చేపట్టేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఓట్ల లెక్కింపు కేంద్రాలకు వెళ్లే దారిని స్పష్టంగా తెలిపే సూచికబోర్డులు ఏర్పాటు చేయాలని, ఎన్నికల సామగ్రిని పైఅంతస్థు ల్లోకి తీసుకెళ్లేందుకు వీలుగా కూలీలను సమకూర్చుకోవాలన్నారు. వీవీప్యాడ్‌లు, బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లను పోలింగ్‌కేంద్రాల వారీగా ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా జాగ్రత్తగా అమర్చుకోవాలని సూచించారు. వాహనాలు పార్కింగ్ చేసేందుకు స్థలాలు గుర్తించాలని ఆయన సూచించారు.



కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న నారాయణరెడ్డి, ఎస్పీ కోటిరెడ్డి

నిండు మనసుతో మోదీని ఆశీర్వదించాలి

చేవెళ్ల/మహేశ్వరం/కందుకూరు/షాబాద్, మే 9 : ప్రజలు నిండు మనసులో మోదీని ఆశీర్వదించాలని బీజేపీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి అన్నారు. చేవెళ్ల పట్టణ కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో గురువారం భారీ రోడ్డుషో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం అసాధ్యమన్నారు. అవినీతి అంటేనే కాంగ్రెస్ పార్టీ విమర్శించారు. చేవెళ్ల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలందరు కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కాగా, దామరగిద్ద గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, చేవెళ్ల ఏసీఎస్ఎస్ వైస్ చైర్మన్ చిలుకూరి వెంకటేశ్, మాజీ ఎంపీటీసీ వెంకటేశంతో పాటు మరో 50మంది కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు ఆయన సమక్షంలో గురువారం బీజేపీలో చేశారు. అదేవిధంగా శంకర్‌పల్లి మండల పరిధిలోని సంకెపల్లి ఎంపీటీసీ మేఘన మరో 50 మంది కార్యకర్తలతో కలిసి బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బీజేపీ ప్రవేశపెట్టిన పథకాలకు ఆకర్షితులై ఇతర పార్టీల నేతలు బీజేపీలో చేరడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఎన్నికల్లో 2లక్షల ఓట్ల మెజార్టీతో గెలుస్తామని ధీమావ్యక్తం చేశారు. ఈ సమావేశంలో చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కెఎస్. రత్నం, రాజ్యసభ సభ్యుడు నారాయణ్‌రావు పంచారీయ, చేవెళ్ల మండల అధ్యక్షుడు దేవర పాండురంగారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు కృష్ణాగౌడ్ ఉన్నారు. అదేవిధంగా తుక్కుగూడ మున్సిపల్ పరిధిలో నిర్వహించిన రోడ్‌షోలో కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్రమోడితోనే దేశ భద్రత, అభివృద్ధి సాధ్యమౌతుందని అన్నారు. తెలంగాణలో 12 స్థానాల్లో బీజేపీ విజయం సాధిస్తుందని అందులో చేవెళ్ల కూడా ఒకటని అన్నారు. కార్యక్రమంలో అందెల శ్రీరాములుయాదవ్, మధుమోహన్ పాల్గొన్నారు. అదేవిధంగా కందుకూరులో కొత్తగూడ మాజీ సర్పంచ్ సాధ మల్లారెడ్డి, ఎంపీపీ మండల జ్యోతి తిమ్మాపురం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. షాబాద్ మండలంలోని రేగడిదోస్వాడ, మక్తగూడ, తిర్మలాపూర్, తిమ్మారెడ్డిగూడలో ఓబీసీ జిల్లా కార్యదర్శి మద్దూరి మాణయ్య, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి గుత్తి సురేష్ ఇంటింటి ప్రచారం నిర్వహించారు.



చేవెళ్లలో నిర్వహించిన రోడ్డుషోలో మాట్లాడుతున్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

ప్రధానిగా నరేంద్రమోదీ కీలకపాత్ర

పరిగి//యాలాల/తాండూరు రూరల్/పెద్దేముల్/ధారూరు: దేశానికి ప్రధానిగా నరేంద్రమోదీ కీలకపాత్ర పోషిస్తున్నారని బీజేపీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. పరిగిలోని కేఎస్ఆర్ గార్డెన్‌లో గురువారం బీజేపి ఎస్టీ మోర్చా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంతర్జాతీయ స్థాయిలో భారత్ గౌరవం మరింతా పెరగాలంటే ప్రధానిగా మోదీ మళ్లీ గెలువాలన్నారు. అనంతరం కేఎస్ఆర్ గార్డెన్ నుంచి పట్టణంలో బీజేపి శ్రేణులు భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రహ్లాద్, పెంటయ్యగుప్తా, పరమేశ్వరొరెడ్డి పాల్గొన్నారు. అదేవిధంగా పరిగిలో కొండా విశ్వేశ్వర్‌రెడ్డి గురువారం రాత్రి రోడ్‌షో నిర్వహించగా అనూహ్య స్పందన లభించింది. పరిగిలోని అమర వీరుల చౌరస్తా నుంచి మెయిన్‌రోడ్ గుండా ఆర్టీసీ బస్టాండ్ మీదుగా రోడ్‌షో నిర్వహించారు. అదేవిధంగా యాలాల మండలం ముకుందాపూర్‌లో ఎంపీపీ బాలేశ్వర్ గుప్తా ఆధ్వర్యంలో ఉపసర్పంచ్ రాజుగురువారం బీజేపీ కండువా కప్పుకున్నారు. అనంతరం సంగెం కుర్దు గ్రామంలో బైక్‌ర్యాలీ ప్రారంభించారు. అదేవిధంగా తాండూరు మండలంలోని రాంపూర్, వీరారెడ్డిపల్లి గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు పి.నర్సింహులు మాదిగ గురువారం ఎమ్మార్పీఎస్ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జగదీష్ మాదిగ, ప్రవీణ్ పాల్గొన్నారు. అదేవిధంగా బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు శేఖాపురం ఆంజనేయులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు యు.రమేష్‌కుమార్ ఆధ్వర్యంలో జినుగుర్తి గ్రామానికి చెందిన టీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు బీజేపీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో పీఏసీఎస్ డైరెక్టర్ సిద్ధయ్యస్వామి, పి.రాములు, జె.నర్సింహులు, జి.శ్రీనివాస్, నవీన్, కాంగ్రెస్ పార్టీ నుంచి సీనియర్ నాయకులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణ ముదిరాజ్, రమేష్, సాయిరెడ్డి, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా పెద్దేముల్ మండలం తట్టెపల్లి, గాజీపూర్, బుద్దారం గ్రామాల్లో గురువారం ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు కోడిగంటి మల్లికార్జున్ మాదిగ, ఎంఎస్పీ జిల్లా ప్రధానకార్యదర్శి స్వామిదాస్‌మాదిగలు కొండావిశ్వేశ్వర్‌రెడ్డికి మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గుడిసె గోపాల్, ఉమాశంకర్, వెంకట్ పాల్గొన్నారు.

బీజేపీపై నమ్మకంతోనే చేరికలు: విశ్వజిత్‌రెడ్డి

ధారూరు/మర్పల్లి: బీజేపీ పార్టీ నమ్మకంతోనే ప్రజలు బీజేపీ వైపు చూస్తున్నారని విశ్వేశ్వర్‌రెడ్డి తనయుడు విశ్వజిత్‌రెడ్డి అన్నారు. మండలంలోని గొట్లిముక్ల గ్రామ ఎంపీటీసీ గోపాల్ తో పాటు నియోజకవర్గంలోని పలువురు కాంగ్రెస్ నాయకులు గురువారం బీజేపీలో చేరారు. వారికి విశ్వజిత్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు వడ్లనందు పాల్గొన్నారు. అదేవిధంగా మర్పల్లి మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహజించారు.



విశ్వజిత్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరుతున్న గొట్లిముక్ల ఎంపీటీసీ గోపాల్

అభివృద్ధిలో భాగస్వాములు కండి : ఎమ్మెల్యే



కాంగ్రెస్‌లో చేరుతున్న లోయపల్లి నాయకులు

మంచాల, మే 9 : రాజకీయాలకు అతీతంగా గ్రామాల అభ్యున్నతికి కృషిచేస్తానని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. మంచాల మండలం లోయపల్లికి చెందిన వివిధ పార్టీల నాయకులు గురువారం ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఆయన మాట్లాడుతూ అభివృద్ధిలో ప్రతీఒక్కరు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మాజీ ఎంపీపీ కె.శ్రీనివాస్‌నాయక్, గణేష్, జంగయ్యగౌడ్, మోతీరాం, వాజిద్, హన్మంతరెడ్డి, వేణుగోపాల్‌రావు, శ్రీనివాస్‌గౌడ్, రాంరెడ్డి పాల్గొన్నారు.

'పాలమూరులో వంశీచంద్‌రెడ్డిని గెలిపించాలి'

కేశంపేట, మే 9: రాహుల్‌గాంధీ ప్రధాని కావాలంటే మహబూబ్‌నగర్ స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డిని గెలిపించాలని వంశీచంద్ సతీమణి ఆశ్లేషరెడ్డి అన్నారు. పాపిరెడ్డిగూడలో ప్రచారం నిర్వహించారు.కాంగ్రెస్ పేదల పార్టీ అన్నారు. ప్రచారంలో జడ్పీటీసీ టి.విశాలశ్రవణ్‌రెడ్డి, వీరేశ్, జగదీశ్వర్ప్, శ్రీధర్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, భాస్కర్‌గౌడ్, రమేష్, ఇబ్రహీం, వెంకటేష్ పాల్గొన్నారు.

'బీజేపీ పాలన నుంచి త్వరలో విముక్తి'

తలకొండపల్లి/కడ్తాల్/మాడ్గుల మే 9: కేంద్రంలోని బీజేపీ పాలన నుంచి ప్రజలకు త్వరలోనే విముక్తి కలగ నుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, నాగర్‌కర్నూల్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి మల్లు రవిలు అన్నారు. పదేళ్ల పాలనలో దోచుకున్న బీఆర్ఎస్‌కు మరోసారి చావుదెబ్బ తప్పదన్నారు. తలకొండపల్లి, చంద్రధన, పడకల్ గ్రామాల్లో ప్ర చారం, తలకొండపల్లిలో కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. నేత లు మాట్లాడుతూ బీజేపీ రాజకీయ లబ్ధికి మతాన్ని వాడుకుంటోందన్నారు. ఎన్నికల అనంతరం రాష్ట్రంలో బీజేపీ కనుమరుగేనన్నారు. కా ర్యక్రమంలో ప్రభాకర్‌రెడ్డి, బాలాజీసింగ్, చిత్తరంజన్‌దాస్, వెంకటేష్, ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, కేశవరెడ్డి, నర్సింహ పాల్గొన్నారు. కడ్తాల, రేఖ్యతండాలో కాంగ్రెస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. కార్యక్రమాల్లో బిక్యానాయక్, బిచ్యానాయక్, జి.భాస్కర్‌రెడ్డి, లక్ష్మయ్య, రామచందర్, మల్లేశ్‌గౌడ్ పాల్గొన్నారు. మాడ్గుల, ఇర్విన్, అర్కపల్లిలో ఎమ్మెల్యే నారాయణరెడ్డి, మంత్రి జూపల్లి కృష్ణారావు, అభ్యర్థి మల్లు రవి రోడ్‌షో నిర్వహించారు.

కాంగ్రెస్ గూటికి కౌన్సిలర్ సోనీజయరామ్



ఆమనగల్లు: ఆమనగల్లు 9వ వార్డుకు బీఆర్ఎస్ కౌన్సిలర్ సోనీజయరామ్ కాంగ్రెస్‌లో చేరారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ డైరెక్టర్ వస్పుల జంగయ్య ఆధ్వర్యంలో ఎమ్మెల్యే నారాయణరెడ్డి, ఎంపీ అభ్యర్థి మల్లు రవిల సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. సోనీజయరామ్‌కు పార్టీ కండువాలు స్వాగతించారు. వైస్‌ఎంపీపీ అనంతరెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మానయ్య, కొప్పు జంగయ్య, మైసయ్య పురుషోత్తం, చిన్నమైసయ్య, విజయ్‌రాథోడ్, జలాల్ పాల్గొన్నారు.

'కాంగ్రెస్ నిర్ణయాలతో నేతన్నలకు భరోసా'

కాంగ్రెస్ ప్రజాపాలనలో నేతన్నలకు వృత్తి రక్షణ, భవిష్యత్తుపై భరోసా కలిగిందని పీసీసీ చేనేత విభాగం రాష్ట్ర నాయకుడు గంజి శ్రీనివాస్ అన్నారు. ఆమనగల్లులో ఆయన గుర్రం కేశవులుతో చేనేత కుటుంబాలను కలిసి మల్లు రవికి ఓటు వేయాలని ప్రచారం నిర్వహించారు. విలేకరులతో మాట్లాడుతూ త్రిఫ్ట్ ఫండ్ స్కీం కింద చేనేతలకు డబ్బులు బ్యాంకు ఖాతాల్లో వేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ఆమోదం తెలిపారన్నారు. బతుకమ్మ చీరల పేరుతో రాజకీయ లబ్ధి పొందారు తప్ప చేనేతలకు ఒరగబడిందేమీ లేదన్నారు. జిల్లా నాయకుడు శ్రీను, ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్ పాల్గొన్నారు.

దేశంలో కదులుతున్న మోదీ పీఠం

ఆమనగల్లు, మే 9 : కాంగ్రెస్ ప్రభంజనంలో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల గల్లంతు ఖాయం అని ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. పీఠం కదుల్తుండడంతో మోదీకి ఓటమి భయం పట్టుకుందని, అందుకే మత విద్వేషాలు రెచ్చగొట్టి లబ్ధికి యత్నిస్తున్నారని ఆరోపించారు. అయ్యసాగర్ గేటు సమీప డీఎంకే ఫంక్షన్ హాల్‌లో గురువారం కల్వకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ కో-ఆర్డినేటర్ ఇందిర అధ్యక్షతన మహిళలతో సమావేశం నిర్వహించారు. మంత్రి జూపల్లి, ఎమ్మెల్యే నారాయణరెడ్డి, మాజీ మంత్రి చిత్తరంజన్‌దాస్, ఎంపీ అభ్యర్థి మల్లు రవి సతీమణి రాజబస్సీదేవి హాజరయ్యారు. జూపల్లి మాట్లాడుతూ కేంద్రంలో రాహుల్ నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే కుల గణన చేసి రిజర్వేషన్లు, నిధులు కేటాయిస్తామన్నారు. బీజేపీ పాలకులు రిజర్వేషన్ల రద్దుకు కుట్ర చేస్తున్నారన్నారు. బీజేపీ, బీఆర్ఎస్‌లు కుమ్మక్కయ్యాయని అన్నారు. ఎంపీపీ కమ్లీమోత్యానాయక్, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, బ్లాక్/మండల కాంగ్రెస్ అధ్యక్షులు నర్సింహ, బిచ్యానాయక్, జగన్, మానయ్య, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కృష్ణారావు

బీఆర్ఎస్‌తోనే తెలంగాణలో అభివృద్ధి

కేశంపేట/కొందుర్గు/చౌదరిగూడ/కొత్తూర్, మే 9: బీఆర్ఎస్‌తోనే తెలంగాణలో అభివృద్ధి సాధ్యం అని మహబూబ్‌నగర్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కొత్తపేట, కేశంపేట గ్రామాల్లో గురువారం ప్రచారం నిర్వహించారు. కా ంగ్రెస్ పాలకులు హామీలకు పాతరేసి ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. కేసీఆర్ పాలనలో నడివేసవిలో సైతం చెరువులు నిండుగా ఉండేవన్నారు. కారు గుర్తుకు ఓటువేసి గెలిపించాలని కోరారు. కొం దుర్గు కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతూ రైతులకు 24గంటల ఉచిత కరెంటు, రైతుబంధు, రైతుబీమా, కల్యాణలక్ష్మి పథకాలను అమలు చేసిన ఘనత కేసీఆర్‌దేఅన్నారు. కాంగ్రెస్ పాలనలతో ఉచిత బస్సు ప్రయాణం తప్ప మహిళలకు ఏ ప్రయోజనం చేకూరలేదన్నారు. ప్రచారంలో షాద్‌నగర్ ఎన్నికల ఇన్చార్జి బాల్‌రాజ్, మాజీ ఎమ్మెల్యే అంజయ్య, ఎంపీపీ రవీందర్, మురళీధర్‌రెడ్డి, రాంబల్, నర్సింగ్‌రావు, జగదీశ్వర్‌గౌడ్, విశ్వనాథం, నవీన్‌రెడ్డి, వెంకటనారాయణరెడ్డి, వెంకట్‌రెడ్డి, పర్వతరెడ్డి, శ్రీశైలంగౌడ్, వేణుచారి, శ్రీనివాస్, జమాల్ ఖాన్, గణేష్, నవీన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రాజేష్, శ్రీధర్‌రెడ్డి, రాంచంద్రయ్య, నర్సింలు, లింగంగౌడ్ పాల్గొన్నారు. చౌదరిగూడలోనూ ప్రచారం నిర్వహించారు. మతతత్వ బీజేపీ మరోసారి అధికారంలోకి వస్తే దేశంలో అల్లర్లు మినహా అభివృద్ధి జరగదన్నారు. రాష్ట్ర సమస్యలను పార్లమెంట్‌లో ప్రస్తావించా లంటే బీఆర్ఎస్‌కు ఓటు వేయాలని కోరారు. బీఆర్ఎస్‌తోనే సుస్థిర పాలన సాధ్యం అని బీఆర్ఎస్ నాయకుడు బి.దేవేందర్‌యాదవ్ అన్నారు. కొత్తూరు మున్సిపాలిటీ తిమ్మాపూర్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి తరపున ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌ఛైర్మన్ డోలి రవీందర్, కౌన్సిలర్ కోస్గి శ్రీనివాస్, గోవింద్‌రెడ్డి, వీరమోని శ్రీనివాస్, విష్ణు పాల్గొన్నారు.



కేశంపేటలో మాట్లాడుతున్న ఎంపీ ఎం.శ్రీనివాస్‌రెడ్డి

నడి రోడ్డుపై భారీ గొయ్యితో..

పొంచి ఉన్న ముప్పు



తిమ్మాపూర్-మల్లాపూర్ రోడ్డు మధ్యలో ఏర్పడిన గొయ్యి

కొత్తూర్, మే 9: తిమ్మాపూర్-మల్లాపూర్ రోడ్డులో తాళ్లగూడ సమీపంలో కల్వర్టు వద్ద నడిరోడ్డుపై భారీ గోతి ఏర్పడి ఏళ్లు గడుస్తున్నా పట్టించుకునే నాథుడు లేడు. ఈ కల్వర్టును నాసిరకంగా నిర్మించడం వల్లే భారీ గోతి ఏర్పడింది. దానికి మరమ్మతులైనా చేయక రోజురోజుకూ గోతి పెద్దదవుతూ వాహనదారుల పాలిట ప్రమాదకరంగా మారుతోంది. రాత్రి పూట వచ్చేవారి ప్రాణాలకు ముప్పుగా పరిణమించింది. ఇప్పటికే ఇక్కడ ప్రమాదాలు జరుగుతున్నాయి. పలుమార్లు ద్విచక్ర వాహనదారులు ఇక్కడ పడిపోయి గాయపడ్డారు. రైతులు తమ పశువులను తోలుకెళ్తున్న సమయంలో వాటి కాళ్లు గోతిలో ఇరుక్కుంటున్నాయి. గోతి వద్ద మరమ్మతులు చేపట్టాలని పలు మార్లు అధికారుల దృష్టికి తీసుకవచ్చిన ఫలితం లేకపోయిందని ఆయా గ్రామాల ప్రజలు అవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రతీ ఓటరు ఓటుహక్కు వినియోగించుకోవాలి

యాచారం/కడ్తాల్, మే 9 : ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగంగా ప్రతీ ఓటరు ఓటుహక్కును వినియోగించుకొని దేశానికి దిశానిర్దేశం చేసే నేతలను ఎన్నుకోవాలని యాచారం తహసీల్దార్ టి.అయ్యప్ప అన్నారు. గురువారం ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ ఓటు హక్కు వజ్రాయుధం వంటిదన్నారు.ఓటు వేయడం మన ధర్మంగా భావించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును వినియోగించుకోవాలని కడ్తాల తహసీల్దార్ ముంతాజ్ అన్నారు. ముద్విన్‌లో ఓటర్లకు అవగాహన కల్పించారు. ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా తనకు నచ్చిన అభ్యర్థికి ఓటు వేసుకోవాలని సూచించారు. ఆర్ఐ వాహిద్, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

పోలీసుల ఫ్లాగ్ మార్చ్

షాబాద్/శంషాబాద్: ఎన్నికల నేపథ్యంలో ఓటర్లు స్వేచ్ఛగా ఓటు వేసేలా పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఓటర్లు నిర్భయంగా ఓటు వేయాలని షాబాద్ ఇన్‌స్పెక్టర్ కాంతారెడ్డి అన్నారు. సోలిపేట్, మద్దూర్, హైతాబాద్ గ్రామాల్లో కవాతునిర్వహించారు. ప్రతి ఓటరు నిర్భయంగా ఓటేయాలన్నారు. కవాతులో గుజరాత్ పో లీసులు పాల్గొన్నారు. శంషాబాద్ ఆర్జీఐఏ పోలీసులు గురువారం సాయంత్రం వివిధ ప్రాంతాల్లో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. సాతంరాయి, కొత్వాల్‌గూడచౌరస్తా, సిద్ధాంతి, కాపుగడ్డ ప్రాంతాల్లో కవాతు నిర్వహించారు. ఈ రూట్ మార్చ్‌లో డీసీపీ నారాయణరెడ్డి, సీఐ బాల్‌రాజ్ తో పాటు వివిధ స్థాయిలకు చెందిన పోలీసులు, సాయుధ బలగాలు పాల్గొన్నాయి.



హైతాబాద్‌లో పోలీసుల కవాతు



శంషాబాద్ పోలీసుల ఫ్లాగ్ మార్చ్

బీజేపీ, బీఆర్ఎస్‌లకు ఓటేస్తే దేశానికి చేటే!



ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

చౌదరిగూడ/ కొందుర్గు/నందిగామ, మే 9 : పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్‌లకు ఓటు వేస్తే దేశానికి చేటే అని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. గురువారం చౌదరిగూడ మండలం పద్మారం, తుమ్మలపల్లి, పెద్ద ఎల్కిచర్ల గ్రామాల్లో ప్రచా రం నిర్వహించారు. పదే ళ్లు పాలించిన బీజేపీ, బీఆర్ఎస్ పాలనతో పేదల బతుకులు మారలేదన్నారు. మహబూబ్‌నగర్ కాంగ్రెస్ అభ్యర్థి వంశీచంద్‌ను గెలిపించాలని కోరారు. బుధవారం రాత్రి కొందుర్గు మండలం లూర్దునగర్ బీఆర్ఎస్ మాజీ ఉపసర్పంచ్ రమేష్‌రెడ్డి, మరో 40మంది కాంగ్రెస్‌లో చేరగా ఎమ్మెల్యే శంకర్ కండువాలు ఆహ్వానించారు. చేతి గుర్తును ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. గురువారం రేగడిచిల్కమర్రి, ముట్పూర్, ఉమ్మెంత్యాల గ్రామాల్లో వంశీచంద్‌రెడ్డి సతీమణి అశ్లేషారెడ్డి ప్రచారం నిర్వహించారు. చెర్కుపల్లి, తంగళ్లపల్లి గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. జడ్పీటీసీ శ్యాంసుందర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, జితేందర్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, కృష్ణారెడ్డి, మల్లేష్, యాదయ్య, లక్ష్మయ్య, నర్సింలు, రాజేందర్‌గౌడ్ పాల్గొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోనే పేదల అభివృద్ధి జరుగుతుందని, దేశం కోసం ప్రాణత్యాగాలు చేసిన ఘనత కాంగ్రెస్‌దని ఎమ్మెల్యే అన్నారు. నందిగామ మండలం మామిడిపల్లిలో మహిళల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి, వంశీచంద్‌రెడ్డి సతీమణి అశ్లేషారెడ్డితో కలిసి మాట్లాడారు. పేదల కోసం అనేక సంస్కరణలు తెచ్చింది కాంగ్రెస్ అన్నారు. బీజేపీ ప్రభుత్వం గ్యాస్, పెట్రోల్, డీజిల్, నిత్యావసర సరుకుల ధరలుపెంచి పేదల నడ్డి విరిచిందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రియాంకశివశంకర్‌గౌడ్, నర్సింలు, కొమ్ము క్రిష్ణ, కుమార్‌గౌడ్, చంద్రపాల్‌రెడ్డి, బాల్‌రెడ్డి, నవీన్‌గౌడ్, చంద్రారెడ్డి, గోపాల్‌రెడ్డి, శంకరయ్య, శివకుమార్, సీతారాములు, నర్సింలు, జ్ఞానేశ్వర్, శ్రీశైలం, సతీష్, బుచ్చయ్య, రాజశేఖర్, సాములయ్య పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు నీడేదీ?

బషీరాబాద్, మే 9: ఉపాధిహామీ పథకంలో పని చేస్తున్న కూలీలకు పనిప్రదేశాల్లో వసతుల లేమితో ఇబ్బందులు పడుతు న్నారు. నిత్యం అసౌకర్యాల నడుమ పనులు చేస్తూ పడరాని పాట్లు పడుతున్నారు. ప్రతీ ఊరిలో 200మంది కూలీలు పాల్గొనేలా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ క్రమంలో పనులు ఊపందుకున్నా లక్ష్యాన్ని మాత్రం చేరుకోలేకపోతున్నారు. దీనికి ఎండల తీవ్రత కారణమని చెప్పవచ్చు. ఉపాధి పనుల వద్ద వసతులు కల్పిస్తే లక్ష్యాన్ని చేరుకోవచ్చని ఫీల్డ్ అసిస్టెంట్లు పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

75శాతమే హాజరు

బషీరాబాద్‌లో 36 గ్రామ పంచాయతీలకు గాను 11వేల351 జాబ్‌కార్డులు ఉన్నాయి. వీటిలో ప్రస్తుతం 5,200 వరకు కూలీలు ఉపాధి పనుల్లో పాల్గొంటున్నారు. వేసవి ప్రారంభంలో ప్రతి ఊరి నుంచి 50 నుంచి 100 మంది వరకు కూలీలు పనులకు వచ్చారు. ఈ లెక్కన రోజూ మండల వ్యాప్తంగా సుమారు 2 వేల నుంచి, 2,500 వరకు కూలీలు పనులకు వచ్చేవారు. ఇటీవల ప్రతి ఊరిలో 200 మంది కూలీలు పనులకు వచ్చేలా చూడలని టార్గెట్ విధిస్తూ ఆదేశాలు జారీ చేసింది. మండల వ్యాప్తంగా రోజూ 6,811 మంది హాజరు కావాల్సి ఉండగా, ప్రస్తుతం 5,200మంది అంటే 75శాతం హాజరవుతున్నట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి.

మైనింగ్ అనుమతుల రద్దుకు గ్రామస్తుల వినతి

కడ్తాల్, మే 9 : మండల పరిధి ముద్విన్ సమీపంలోని సర్వే నంబర్ 95లో గల నల్లగుట్ట వద్ద మైనింగ్ ఏర్పాటుకు ఇచ్చిన అనుమతులు రద్దు చేసి పనులు ప్రారంభించకుండా చూడాలని గ్రామ నాయకులు తహసీల్దార్ ముంతాజ్‌ను కోరారు. పొలాల సమీపంలో మైనింగ్ చేస్తే తాము ఉపాధి కోల్పోతామని గ్రామస్తులన్నారు. ముద్విన్ నల్లగుట్ట మైనింగ్ ఏర్పాటుకు ఇచ్చిన అనుమతులను రద్దు చేయకుంటే ఈ నెల 13న జరుగనున్న పార్లమెంట్ ఎన్నికలను బహిష్కరిస్తామని గ్రామస్తులు అన్నారు. కలెక్టర్, ఆర్డీవో, ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, తహసీల్దార్‌లకు వినతి పత్రాలు అందజేశారు. దీంతో తహసీల్దార్ నల్లగుట్టను సందర్శించారు. మైనింగ్‌కు తలపెట్టిన భూమిని పరిశీలించారు. గుట్ట వద్ద ఎలాంటి పనులు ప్రారంభించలేదని గుర్తించారు. గ్రామస్తుల విన్నపాన్ని జిల్లా ఉన్నతాధికారులకు నివేదిస్తామని ఈ సందర్భంగా తహసీల్దార్ పేర్కొన్నారు.

'డీకే అరుణ నోటిని అదుపులో పెట్టుకోవాలి'

షాద్‌నగర్, మే 9: అరుణమ్మ ఓటమి భయంతో సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వాఖ్యలు చేస్తే సహించబోమని కాంగ్రెస్ నేతలు హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో గద్వాల గడీల పాలన కొనసాగదన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని సూచించారు. బుధవారం రాత్రి షాద్‌నగర్‌లో నిర్వహించిన బీజేపీ కార్నర్ మీటింగ్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై మహబూబ్‌నగర్ పార్లమెంట్ అభ్యర్థి చేసిన వ్యాఖ్యలపై గురువారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు రఘు, బాబర్‌ఖాన్ మీడియా సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రజల ఆదరాభిమానాలు చూరగొన్న రేవంత్‌రెడ్డిపై డీకే అరుణ వ్యక్తిగత దూషణలు చేయడంపై సరి కాదన్నారు. తెలుగుదేశం, కాంగ్రెస్ పార్టీలో మంత్రి పదవులు చేపట్టిన ఆమె మహబూబ్‌నగర్ జిల్లా అభివృద్ధికి ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఇలాంటి వ్యాఖ్యలు పునరావృతమైతే ప్రజలే ఆమెకు తగిన బుద్ధి చెబుతారని అన్నారు.

'అణగారిన వర్గాల గొంతుక ప్రవీణ్‌కుమార్'

ఆమనగల్లు/కడ్తాల్/తలకొండపల్లి, మే 9 : విద్యావంతుడు, ప్రజా సమస్యలపై అవగాహన ఉన్న నాగర్‌కర్నూల్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని బీఆర్ఎస్ నాయకులు కోరారు. ప్రజలను మోసగించిన బీజేపీ, కాంగ్రెస్ ప్రభుత్వాలకు ప్రజలు గుణపాఠం చెప్పాలన్నారు. ఆమనగల్లు, కడ్తాల, తలకొండపల్లి మండలాల్లో గురువారం నాయకులు ప్రచారం నిర్వహించారు. కారు గుర్తుకు ఓటు వేసి ప్రవీణ్‌కుమార్‌ను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ప్రవీణ్‌కుమార్‌ను ఎంపీగా గెలిస్తే ప్రజాసమస్యలపై పార్లమెంట్‌లో మాట్లాడి పేదలకు న్యాయం జరిగేలా చట్టాల రూపకల్పకు పాటుపడుతారన్నారు. ప్రచారంలో జడ్పీటీసీలు అనురాధపత్యానాయక్, దశరథ్‌నాయక్, వెంకటేశ్, ఎంపీపీ నిర్మలశ్రీశైలంగౌడ్, డీసీసీబీ వెంకటేశ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సీఎల్ శ్రీనివాస్‌యాదవ్, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీశైలం, పత్యానాయక్, అర్జున్‌రావు, ఆనంద్, దోనాదుల కుమార్, పీఏసీఎస్ డైరెక్టర్ సేవ్యానాయక్, నాయకులు సయ్యద్ ఖలీల్, జోగు వీరయ్య, గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి, పాండు, దోళ్యనాయక్, రమేశ్, మల్లేశ్, నర్సింహ, లాయక్ అలీ, సాయిలు, రమేశ్, లచ్చిరామ్‌నాయక్, చంద్రమౌళి, బొప్పిడి గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

'గ్యారంటీల పేరుతో కాంగ్రెస్ మోసం'

మంచాల, మే 9 : గ్యారంటీల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చీరాల రమేష్, ఎంపీపీ జాటోత్ నర్మదలచ్చిరాం అన్నారు. మంచాలలో గురువారం నిర్వహించిన మండల ముఖ్యనేతల సమావేశంలో వారు మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన 100రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని బూటకపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు నెలలు గడుస్తున్నా ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. రేవంత్‌రెడ్డికి ఎన్నికల్లో గుణపాఠం తప్పదని హెచ్చరించారు. భువనగిరి బీఆర్ఎస్ అభ్యర్థి క్యామ మల్లేష్‌ను భారీ మెజారిటీతో గెలిపించుకోవాలని శ్రేణులకు పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు బహదూర్, యాదయ్య, బి.పుల్లారెడ్డి, ఎం.సికిందర్‌రెడ్డి, వెంకటేష్‌గౌడ్, బిక్షపతి, శేఖర్, బద్రీనాథ్‌గుప్తా, ఎండీ.జానీపాషా, కిషన్‌రెడ్డి, జంగయ్య, పి.సుకన్య, ఎస్.అనిత, అమరేందర్‌రెడ్డి, వెంకటేష్ పాల్గొన్నారు.

'కాంగ్రెస్‌తోనే అభివృద్ధి, సంక్షేమం'

కొత్తూర్, మే 10: కాంగ్రెస్‌తోనే అభివృద్ధి, సంక్షేమం జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మామిడి సిద్దార్థరెడ్డి అన్నారు. పెంజర్ల తదితర గ్రామాల్లో మహబూబ్‌నగర్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి తరఫున ప్రచారం నిర్వహించారు. దేశంలో కాంగ్రెస్ పార్టీ గాలి విస్తుందని, రాహుల్‌గాంధీ ప్రధాని కావడం ఖాయం అన్నారు. నాయకులు కుమ్మరి రమేష్, శ్రీకాంత్‌రెడ్డి, గిరి, రజేష్, బాలకృష్ణ, పాల్గొన్నారు.

'బీజేపీతోనే అవినీతి రహిత పాలన'

కడ్తాల్, మే 9 : బీజేపీతోనే అవినీతి రహిత, పాలన సాధ్యం అని బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాణవత్ శంకర్ అన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలను నమ్మి ప్రజలు మోసపోవద్దని కోరారు. కడ్తాల, గానుమర్ల తండాలో గురువారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీజేపీ అభ్యర్థి భరత్‌ప్రసాద్‌ను గెలిపించాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన మోర్చా ఉపాధ్యక్షుడు జర్పుల లక్ష్మణ్‌నాయక్, ఉపాధ్యక్షులు మునేశ్, రాజు, నవీన్, వినోద్, ఉమేశ్ పాల్గొన్నారు. అలాగే ఆమనగల్లులోని 15 వార్డులో బీజేపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గిరి, వెంకటేశ్, లక్ష్మణ్, రవితేజ, జగన్ పాల్గొన్నారు.

'ఎన్నికల్లో బీజేపీని ఓడించాలి'

శంషాబాద్, మే 9: పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడించేందుకు సీపీఎం పనిచేస్తుందని పార్టీ జిల్లా కార్యదర్శి కాటికల్ల భాస్కర్ అన్నారు. గురువారం శంషాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. బీజేపీ పాలనలో పెత్తాందార్లకు తప్ప పేదలకు న్యాయం చేకూరదన్నారు. ఆ పార్టీని ఓడించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు డి.రామచందర్, మల్లేష్, జగదీష్, కుమార్, ప్రణయ్ పాల్గొన్నారు.

'మతోన్మాద బీజేపీకి ఓటుతో బుద్ధి చెప్పాలి'

ఆమనగల్లు, మే 9: మతోన్మాద బీజేపీకి ఓటుతో బుద్ధిచెప్పేలా పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించాలని సీపీఎం రాష్ట్ర నాయకుడు కానుగుల వెంకటయ్య పిలుపు నిచ్చారు. ఆమనగల్లులో గురువారం ఇండియా కూటమిని గెలిపించాలని కోరుతూ ప్రచారం నిర్వహించారు. కేంద్రంలోని బీజేపీ రైతులు, కూలీలను తమ విధానాలతో వేదనకు గురిచేసిందన్నారు. ఉపాధి హామీ పథకాన్ని నీరుగార్చి ప్రభుత్వ రంగ సంస్థలను, సహజ వనరులను కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేస్తోందన్నారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తూ రాజ్యాంగరద్దుకు పూనుకున్న బీజేపీకి గుణపాఠం చెప్పాల న్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు చెన్నయ్య, శివశంకర్, తలకొండపల్లి మండల నాయకుడు పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థి గెలుపునకు ఆలయంలో పూజలు

యాచారం/మంచాల, మే 9 : భువనగిరి ఎంపీ కాంగ్రెస్ అభ్యర్థి చామలకిరణ్‌కుమార్‌రెడ్డి గెలవాలని గురువారం నానక్‌నగర్‌లో ఆంజనేయస్వామి వారికి మండల కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ముత్యాల వెంకట్‌రెడ్డి, పలువురు నాయకులు పూజలు చేశారు. అనంతరం కాంగ్రెస్ వాల్‌పోస్టర్లను ఓటర్లకు పంపిణీ చేశారు. ఎంపీగా కిరణ్‌కుమార్‌రెడ్డి విజయం ఖాయం అని ధీమా వ్యక్తం చేశారు. మేడిపల్లి, మేటె, శ్రీశైలం కొత్తపల్లి, చౌదర్‌పల్లి, నందివనపర్తి, కుర్మిద్ద, నజ్దిక్‌సింగారం గ్రామాల్లో కాంగ్రెస్ కార్యకర్తలు నాయకులు ఇ ల్లిల్లు తిరిగి కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలని ఓటర్లను కోరారు. మంచాల మండలం ఆరుట్ల తదితర గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాసంక్షేమానికి పెద్దపీట వేస్తోందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్రనేత కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. ఆరుట్లలో ఉపాధి కూలీలతో మాట్లాడి ఓట్లు అభ్యర్థించారు. కాంగ్రెస్ నేతలు ఆనంగళ్ల యాదయ్య, చంద్రయ్య, మాసయ్యగౌడ్, బుగ్గరాములు, చిందం ఐలయ్య, వస్పరి కుమార్, మార సురేష్, ఎన్నిదుల సురేష్, మార లక్ష్మన్, జంగారెడ్డి, బుడిగల పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్లో ఇంటర్ అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

మహేశ్వరం, మే 9 : పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు మహేశ్వరం మోడల్ స్కూల్లో ఇంటర్‌మీడియట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు ఈ నెల 9వ తేదీ నుంచి 31వ తేదీవరకు దరఖాస్తు చేసుకోవచ్చని పాఠశాల ప్రిన్సిపాల్ ధనుంజయ్ తెలిపారు. ఎంపీసీలో 40సీట్లు, బైపీసీలో 40, సీఈసీలో 40, ఎమ్ఈసీలో 40సీట్లు మొత్తం 160 సీట్లు అందుబాటులో ఉన్నాయని టెన్త్‌లో పొందిన జీపీఏ ఆధారంగా కోరుకున్న కోర్సులో ప్రవేశం లభిస్తుందన్నారు. విద్యార్థులు పదో తరగతి పాసైన ఆన్‌లైన్ మెమో, ఆధార్ కార్డు, రెండు ఫొటోలతో మహేశ్వరం మోడల్ స్కూలుకు వచ్చి దరకాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9849746567, 9603150011 అనే నంబర్లలో సంప్రదించాలన్నారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం

మాడ్గుల, మే 9: సుద్దపల్లికి చెందిన మిడిదొడ్డి పెద్ద తిరుపతయ్య తల్లి లక్ష్మమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందింది. విషయం తెలుసుకున్న ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ వెంకటేష్ సమకూర్చిన రూ.3వేలను సింగిల్ విండో డైరెక్టర్ రాజవర్ధన్‌రెడ్డి గురువారం బాధిత కుటుంబానికి అందచేశారు. ఎంపీటీసీ వెంకటయ్య, రామస్వామి, శ్రీకాంత్, హరికృష్ణ ఉన్నారు.

క్రీడల్లో యువత రాణించాలి



బహుమతులు అందజేస్తున్న కేఎస్.రత్నం

చేవెళ్ల, మే 9: యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని మాజీ ఎమ్మెల్యే కేఎస్.రత్నం, ఎంపీపీ విజయలక్ష్మి అన్నారు. చేవెళ్లలో కొండా వెంకట్‌రంగారెడ్డి మెమోరియల్ ఆధ్వర్యంలో రెండు నెలలు క్రికెట్ టోర్రి కొనసాగింది. గురువారం ముంగిపు పోటీలో వికారాబాద్ జట్టు విజయం సాధించింది. రన్నర్‌గా చేవెళ్ల నిలిచింది. విజేతకు రూ.3లక్షలు, షీల్డ్, రన్నర్‌కు రూ.2లక్షలు, షీల్డ్‌ను బహుకరించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు పాండురంగారెడ్డి, ప్రధానకార్యదర్శి అనంత్‌రెడ్డి, కృష్ణాగౌడ్, మాణిక్యరెడ్డి, వెంకట్‌రెడ్డి, వైభవ్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, నాగరాజు, క్రీడకారులు ఉన్నారు.

'అధైర్య పడొద్దు.. అండగా ఉంటాం'

తలకొండపల్లి, మే 9: వెల్జాల సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన పబ్బతి నరేశ్, పరశురాములు కుటుంబాలను గురువారం మాజీ ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే నారాయణరెడ్డి పరామర్శించారు. వెంకటాపూర్‌లో బాధిత కుటుంబాలను కలిశారు. ప్రభుత్వ పరంగా రెండు కుటుంబాలకు తోడ్పాటు అందేలా చూస్తామన్నారు. పరామర్శించిన వారిలో జడ్పీ వైస్‌ఛైర్మన్ బాలాజీసింగ్, పీసీసీ ప్రధాన కార్యదర్శి చారగొండ వెంకటేశ్, ప్రభాకర్‌రెడ్డి, భగవాన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, నర్సింహ, రమేశ్, సుధాకర్‌రెడ్డి, కృష్ణ, బిక్య, బిచ్య, అంజయ్యగుప్తా, మోహన్‌రెడ్డి ఉన్నారు.

మంత్రి జూపల్లిని కలిసిన మోత్యానాయక్

కడ్తాల్, మే 9: ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును గురువారం కాంగ్రెస్ జిల్లా సీనియర్ నాయకుడు మోత్యానాయక్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఆమనగల్లు మండలంలో ప్రచార కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వచ్చిన మంత్రిని కలిసి పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. కల్వకుర్తి నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

నేడు ఉపాధి పనులపై ఓపెన్ ఫోరం

యాచారం, మే 9 : జాతీయ ఉపాధి హామీ పనులపై ఈ నెల 10న మండల పరిషత్ ఆవరణలో ఉదయం 10గంటలకు ఓపెన్ ఫోరం ఉంటు ందని ఎంపీడీవో నరేందర్‌రెడ్డి గురువారం తెలిపారు. ఈ ఫోరంలో వివిధ గ్రామాల కూలీలు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

ఎస్సీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడిగా సత్యనారాయణ



సత్యనారాయణను అభినందిస్తున్న విశ్వేశ్వర్‌రెడ్డి

షాబాద్, మే 9: బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడిగా మండల పరిధి మన్‌మర్రి గ్రామానికి చెందిన ఎస్.సత్యనారాయణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు బంటు జ్ఞానేశ్వర్ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, జ్ఞానేశ్వర్‌లకు ధన్యవాదాలు తెలిపారు. జిల్లాలో పార్టీ అభివృద్ధికి పాటుపడతానని అన్నారు.

కష్టపడి చదివితేనే ఉజ్వల భవిష్యత్తు



విద్యార్థులను సన్మానిస్తున్న కొమరబండ గ్రామస్తులు

షాబాద్, మే 9: విద్యార్థులు కష్టపడి చదివితేనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని కొమరబండ గ్రామస్తులు అన్నారు. పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన గ్రామ విద్యార్థులను గురువారం సన్మానించారు. విద్యార్థులు కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో గంధం రమేష్, యు.రమేష్, నాగమణిశేఖర్ ఉన్నారు.

చింతపట్లలో వేసవి శిబిరం



శిబిరంలో ఆటలు ఆడేందుకు వచ్చిన విద్యార్థులు

యాచారం, మే 9 : విద్యార్థులు ఉదయం సాయంత్రం ఆటలు ఆడుకునేందుకు శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు 'మన ఊరు-మన బడి' కార్యక్రమం నిర్వాహకులు పీఈటీ సాబెర్ చెప్పారు. చింతపట్ల పాఠశాల ఆవర ణలో గురువారం శిబిరాన్ని ప్రారంభించారు. వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, క్యారమ్స్, టెన్నిస్ ఆటలు నేర్పుతున్నామన్నారు. నెల పాటు ఉదయం 6 నుంచి 8గంటల వరకు, సాయంత్రం 6గంటల వరకు శిబిరం ఉంటుందన్నారు. కార్యక్రమంలో నరేష్, చరణ్, అరుణ్, పాండు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శిగా నరేందర్‌రెడ్డి



చేవెళ్ల, మే 9: బీఆర్ఎస్ చేవెళ్ల మండల ప్రధాన కార్యదర్శిగా నరేందర్‌రెడ్డి నియమితులయ్యారు. గురువారం మండల అధ్యక్షుడు ప్రభాకర్, మాజీ ఎంపీపీ బాల్‌రాజ్ చేతులు మీదుగా నియమాకపత్రాన్ని అందుకున్నారు. ఆయన మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో ప్రధాన కార్యదర్శి బాధ్యతలు అప్పగించడం సంతోషంగా ఉందన్నారు. బీఆర్ఎస్ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. తన ఎన్నికకు సహకరించిన పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

నాయకుల ఇంటింటి ప్రచారం ముమ్మరం

ఇబ్రహీంపట్నం, మే 9 : పోలింగ్ దగ్గర పడుతుండడంతో నేతలు ప్రచారంలో తలమునకలయ్యాయి. భువనగిరి లోక్‌సభ నియోజకవర్గంలో కా ంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్, సీపీఎంలు ప్రచారం చేస్తున్నాయి. మండలాలు, మున్సిపాలిటీల వారీగా రోడ్ షోలు నిర్వహిస్తున్నారు. నాయకులు ఇంటింటి ప్రచారంతో ఓట్లు అభ్యర్థిస్తున్నారు. సాయంత్రం వేళల్లో మందు, విందులతో ఓట్లు రాబట్టేలా స్థానిక నాయకులు పనిచేస్తున్నారు.

పోలీసులకు డీసీపీ అభినందన

కడ్తాల్, మే 9: మండలంలోని మక్తమాదారం శివారులో ఏప్రిల్ 29న జరిగిన గుర్తుతెలియని వ్యక్తి హత్య కేసులో సమయస్ఫూర్తి, సకాలంలో స్పందించి కేసు ఛేదించిన కడ్తాల పోలీసులను శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి అభినందించారు. గురువారం డీసీపీ కార్యాలయంలో సీఐ శివప్రసాద్, ఎస్ఐ వరప్రసాద్, పోలీసు సిబ్బందిని అవార్డులతో సత్కరించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని కేసును ఛేదించి నేరస్తులను రిమాండ్‌కు తరలించడంలో కడ్తాల పోలీసులు చేసిన కృషి అభినందనీయమని నారాయణరెడ్డి పేర్కొన్నారు.



సీఐ, ఎస్ఐ, సిబ్బందిని అభినందిస్తున్న డీసీపీ నారాయణరెడ్డి

క్రైం కార్నర్

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

యాచారం, మే 9 : శుభకార్యానికి వెళ్తూ యాచారంలో డివైడర్‌ను ఢీకొని గాయ పడిన వ్యక్తి చికిత్స పొందుతూ మరణించాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కడ్తాల మండలం మైసిగండికి చెందిన ఘాంస్య(65) ఉప్పుగూడలో ఉంటున్నాడు. గత నెల 28న తన బంధువుల ఇంట్లో శుభ కార్యానికని బైక్‌పై బయల్దేరాడు. యాచారంలో బైక్ స్కిడ్ అయి గాయపడ్డాడు. పోలీసులు క్షతగాత్రుడ్ని నగరంలోని యశోద ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం ఘాంస్య మరణించాడు.